WANTED



బహుజన వేదిక
తెలుగు జాతీయ దినపత్రికలో పనిచేయుటకు
ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని
అన్ని జిల్లాలకు మరియు నియోజకవర్గ మండల కేంద్రాలకు
జిల్లా ఇంఛార్జిలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెను.
ఆయా జిల్లాల్లోని మరియు ప్రాంతాలలో రాజకీయాలు,
ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు వ్రాయగల సామర్థ్యం ఉండాలి,
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును
వెంటనే సంప్రదించండి
9849805056 | 9494900294



RNI Reg NO: APTEL/2024/ 86898

# బహుజన వేదిక

తెలుగు జాతీయ దినపత్రిక



చదవండి ! చదివించండి !! చందాదారులు కండి !!!

వేదిక చందా వివరాలు



సంవత్సర చందా : రూ. 1800/-
అర్ధ సంవత్సర చందా : రూ. 900/-
ఒక నెల చందా : రూ. 150/-
విడి పత్రిక : రూ. 5/-
వివరాల కొరకు :
9849805056, 9494900294



ANANTHAPURAM I KURNOOL I KADAPA I AMARAVATHI HYDERABAD I VIJAYAWADA I VISHAKAPATNAM I GUNTUR I PRAKASAM I RAJAMANDRI I TADEPALLIGUDEM I KHAMMAM I KARIMNAGAR I I NALGONDA I

సంపుటి : 2 సంచిక : 151 | బుధవారం 14 జనవరి 2026 | ఎడిటర్ : పి రామాంజనేయ ప్రసాద్ | వెల : 5/- | పేజీలు : 8 | Email : bahujanavedikaap@gmail.com


## రాష్ట్రాలకు సుప్రీం హెచ్చరిక



- విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, క్రీడా సముదాయాలు, రైల్వే స్టేషన్ల వంటి ప్రజా ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలి
- వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డాగ్ షెల్టర్లకు తరలించాలి
- రాష్ట్రాలు సరైన చర్యలు తీసుకోకుంటే పెద్దలను, పిల్లలను కుక్కలు కరిస్తే అధిక మెత్తంలో రాష్ట్రాలు పరిహారం చెల్లించేలా ఆదేశిస్తాం
- అదేవిధంగా కుక్కలకు ఫుడ్ పెట్టేవారు వారి ఇంట్లోని వాటిని పెంచుకొని అక్కడే వాటికి తిండిపెట్టండి".

## క్షుద్ర రాజకీయాలు మానుకోకుంటే నీకు రాజకీయ గల్లంతే

### జగన్‌కు మంత్రి సవిత హెచ్చరిక

### టీఆర్ఎస్ పార్టీవాళ్లకు, మీకున్న చీకటి ఒప్పందం ఏమిటి?



**పెనుకొండ/శ్రీసత్యసాయి**

'రాయలసీమను సస్య శ్యామలం చేయాలని సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తుంటే, రాయలసీమ బిడ్డగా సహకరించడం మానేసి, జగన్ విషం కక్కుతున్నారు... స్వార్థ రాజకీయాల కోసం అన్నదమ్ముల్లా ఉండే తెలంగాణా, ఏపీ ప్రజల మధ్య బీఆర్ఎస్ నేతలతో కలిసి చిచ్చుపెడుతున్నారు.... కోర్టులో కేసులు వేసి, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నేనే ఆపించానని బీఆర్ఎస్ - మిగతా3లో

# ప్రజలతో మమేకమై..



- ప్రజల ఆశయాల సాధనకు అండగా ఉంటానని హామీ
- సంక్రాంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు..
- తెలుగు ప్రజలకు భోగి శుభాకాంక్షలు తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు
- భోగి మంటలు ప్రతి కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని ఆకాంక్ష
- అందరి జీవితాలు భోగభాగ్యాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నట్లు వెల్లడి

**తిరుపతి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత గ్రామమైన నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో కలిసి సరదాగా గడిపారు. తన నివాసం ముందున్న మైదానంలో చుట్టుపక్కల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీలను సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు స్వయంగా వీక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి, పిల్లలతో ఫొటోలు దిగి వారిలో ఉత్సాహం నింపారు. ఈ వేడుకల్లో నారా, నందమూరి కుటుంబాలకు చెందిన చిన్నారులు కూడా పాల్గొనడం విశేషం. సొంతూరులో పండుగ జరుపుకొంటూనే.. అటు కుటుంబ సభ్యులు, ఇటు సామాన్య ప్రజలతో సమయాన్ని గడుపుతూ.. సీఎం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజకీయ హడావుడికి దూరంగా, గ్రామీణ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు స్థానికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. - మిగతా3లో



## త్వరలో తీపి కబురు

- ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ వేతన పరిమితి పెంపు?
- ఉద్యోగుల సామాజిక భద్రతా పథకాలను మరింత బలోపేతం
- ప్రస్తుత సమాచారం ప్రకారం, ఈ రెండు సంస్థల వేతన పరిమితిని నెలకు రూ.25,000 నుంచి రూ.30,000 మధ్య స్థాయికి పెంచాలని భావిస్తోంది



## ఇరాన్‌లో భగ్గుమన్న ప్రజాగ్రహం

- నిరసనల్లో 2 వేల మంది మృతి
- ఇరాన్‌లో నిరసనల్లో వేల మంది మృతి
- రాయిటర్స్‌కు వెల్లడించిన ఇరాన్ ప్రభుత్వ అధికారి
- ఆర్థిక సంక్షోభంతో దేశవ్యాప్తంగా చెలరేగిన ఆందోళనలు

## ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది



- పాకిస్తాన్‌కు చుక్కలు చూపిస్తాం
- భవిష్యత్‌లో ఎలాంటి కవ్వింపు చర్యలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటాం
- ఆర్మీ చీఫ్ హెచ్చరిక

## నిధులు పొందిన రాష్ట్రాల్లో

# ఏపీ మూడోది



- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- గత 19 నెలల్లో ఆరోగ్య రంగానికి 48 శాతం నిధులు తమ శాఖ వెచ్చించింది
- మిగిలిన నిధుల విడుదల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో తక్షణమే చర్చించాలి
- పూర్తి స్థాయిలో కేంద్ర సాయం సాధించాలని అధికారులకు మంత్రి ఆదేశం
- ఏపీలో ఎన్డీయే ప్రభుత్వ కృషిని కేంద్రం గుర్తించింది

**అమరావతి**

15వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి రూ. 567 కోట్ల గ్రాంట్‌ను కేంద్రం విడుదల చేసిందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇవి ఆఖరి విడత నిధులని ఆయన తెలిపారు. గత 19 నెలల్లో ఆరోగ్య రంగానికి 48 శాతం నిధులు తమ శాఖ వెచ్చించిందని వివరించారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఉన్నతాధికారులతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ వ్యయంపై మంత్రి సత్యకుమార్ సమీక్షించారు. అనంతరం - మిగతా3లో




## భారత ఆవిష్కరణలకు నెట్‌ఫ్లిక్స్ చేయూత

- కేంద్ర ప్రభుత్వంతో కీలక భాగస్వామ్యం
- కేంద్ర ప్రభుత్వంతో చేతులు కలిపిన నెట్‌ఫ్లిక్స్
- 'నయే భారత్ కీ నయీ పెహచాన్' పేరుతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం
- 8 భారత స్టార్టప్‌ల విజయగాథలపై యానిమేటెడ్ చిత్రాలు
- వివిధ యూనివర్సిటీల విద్యార్థులతో చిత్రాల రూపకల్పన
- ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఈ కార్యక్రమం

## ప్రభుత్వ బడుల్లో చదివిన

# విద్యార్థుల ప్రతిభ

### అభినందించిన సీఎం చంద్రబాబు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన పిల్లలకు ఉచిత, నాణ్యమైన ఆవాస విద్యను అందించే లక్ష్యంతో 1983లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను ప్రారంభించింది. ప్రస్తుతం, రాష్ట్రవ్యాప్తంగా 67 బాలుర సంస్థలు మరియు 123 బాలికల సంస్థలతో కలిపి మొత్తం 190 సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థలు ఐదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందిస్తూ పనిచేస్తున్నాయి. 2022లో, అన్ని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ మరియు జూనియర్ కళాశాలలకు 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులాలు'గా పేరు మార్చబడింది. 2025-26 యొక్క ముఖ్య విజయాలు.. ఎస్సెస్సీ ఉత్తీర్ణత శాతం: 98.59 శాతం, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం: 98.41 శాతం,ఎ షైనింగ్ స్టార్ అవార్డుల కింద - మిగతా3లో

# ప్రజలతో మమేకమై..

-మొదటిపేజీ తరువాయి

నారావారిపల్లెకు చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కో స్కూల్‌కు చెందిన పిల్లలతో సీఎం చంద్రబాబు దంపతులు వేర్వేరుగా గ్రూప్ ఫొటోలు దిగారు. ఈ క్రీడల్లో నారా, నందమూరి కుటుంబ చిన్నారులు పాల్గొనడం విశేషం. వీరిలో గెలుపొందిన వారికి ఇతర పిల్లలతో సమానంగా బహుమతులు అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నారా దేవాన్ష్ పలు పోటీల్లో పాల్గొని ఆకట్టుకున్నారు.

**పరదాల సంస్కృతికి భిన్నంగా..**

పరదాల సంస్కృతికి పూర్తిగా భిన్నంగా, సొంతూరు నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. క్రీడా పోటీల అనంతరం ఇంటికి వెళ్లే మార్గమంతా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

**అర్జీల స్వీకరణ..**

ముఖ్యమంత్రి స్వయంగా తమ అర్జీలు స్వీకరించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చుట్టు పక్కల జిల్లాల నుంచి ప్రత్యేకంగా తరలివచ్చిన ప్రజలు కూడా చంద్రబాబుకు అర్జీలు అందజేశారు. సమస్యలు విన్న సీఎం చంద్రబాబు అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది.

**ప్రజాపాలనకు నిదర్శనంగా కార్యక్రమం..**

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ, ప్రజల అర్జీలను స్వయంగా స్వీకరించడం వంటి చర్యలు చంద్రబాబు ప్రజాపాలనకు నిదర్శనంగా నిలిచాయి. నారావారిపల్లెలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానికంగా విశేష ఆదరణ లభించింది.

**అధికారులకు ఆదేశాలు..**

ప్రజల నుంచి తీసుకున్న వినతి పత్రాలను సీఎం చంద్రబాబు పరిశీలించారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి నేరుగా వినడంపై సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# సమ్ థింగ్ స్పెషల్‌గా పవన్



**కాకినాడ :** పొత్తు కుదుర్చడంలో ఆయనదే కీరోల్. ఇంకో పది, పదిహేనేళ్లు కలిసే ఉంటామని చెప్తున్నది కూడా ఆయనే. ఎవరెన్ని కుట్రలు చేసినా కూటమి ఒకటిగానే ఉంటుందని.. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పదే పదే చెప్తున్నారు. కూటమి లాంగ్ లీవ్ అంటూ పవన్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఇదే మొదటి సారి కాదు. అయినా ఈసారి పిఠాపురం వేదికగా పవన్ చేసిన వ్యాఖ్యలు అయితే సమ్‌థింగ్ స్పెషల్‌గా మారాయి. ఇంటా, బయటా అందరికీ ఓ సంకేతం పంపించేలా ఆయన చేసిన ప్రకటన ఇప్పుడు పెద్ద చర్చకు దారితీస్తోంది. నిజానికి కూటమి విషయంలో చంద్రబాబు కంటే ముందే పవన్ ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇస్తూ వస్తున్నారు. తాము కలిసే ఉంటామని.. ఇంకో 15ఏళ్లు చంద్రబాబే సీఎంగా ఉండాలని చెప్తూ వస్తున్నారు. అయితే ఈ సారి పవన్ చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీ నేతలను ఉద్దేశించే అన్న చర్చ జరుగుతోంది. జనసేనలో కొందరు నేతలు.. టీడీపీ, బీజేపీ నేతలతో కలిసి ముందుకు సాగకపోవడంతో పాటు.. అలయన్స్‌కు భంగం కలిగించేలా బిహేవ్ చేస్తున్నారట. అక్కడక్కడ సమస్యలు ఉన్నాయని..వాటిని పెద్దగా చేసి చూపించే ప్రయత్నం జరుగుతోందనేది పవన్ దృష్టికి వచ్చిందట. దీంతో సమయం సందర్భంగా చూసి మరీ.. పిఠాపురం వేదికగా.. అటు రాజకీయ ప్రత్యర్థులకు.. ఇటు సొంత పార్టీ జనసేన నేతలకు పవన్ క్లియర్ కట్ ఇండికేషన్ ఇచ్చారని టాక్ నడుస్తోంది. చంద్రబాబుకు, తనకు మధ్య మంచి సయోధ్య ఉందని కూడా పవన్ స్పష్టం చేశారు. ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు, గ్యాప్‌లు లేవని చెప్పుకొచ్చారు పవన్. సేమ్‌టైమ్ పిఠాపురంలో కొందరు చేస్తున్న కుట్రలు ఫలించవంటూ.. తమ రాజకీయ ప్రత్యర్థులను గట్టిగానే టార్గెట్ చేశారు పవన్. గత ప్రభుత్వం కేవలం బూతులు తిట్టడం, అక్రమ కేసులు పెట్టడంపైనే దృష్టి పెట్టిందని, ఇప్పుడు పిఠాపురంలో మళ్లీ అదే పద్ధతులను అమలు చేయాలని చూస్తున్నారని ఫైరయ్యారు. పులివెందులలో సొంత బాబాయిని చంపినా అది వార్త కాదు, కానీ పిఠాపురంలో చిన్న పిల్లల గొడవ పడితే దానికి కులమతాల రంగు పులిమి రచ్చ చేస్తారా అంటూ విమర్శించారు. పిఠాపురంలో అశాంతి సృష్టించాలని చూస్తే, ఇక్కడే కూర్చునే అరాచక శక్తులను ఏరివేస్తానంటూ గర్జించారు సేనాని. తనను మెత్తని మనిషిగా భావించి నెత్తికెక్కాలని చూడొద్దన్న పవన్.. గొడవ పెట్టుకోవాలంటే తాను కూడా సిద్ధమేనంటూ సవాల్ చేసి మరింత ఇంట్రెస్టింగ్ చర్చకు దారి తీశారు. కూటమిని వీక్ చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, అలాంటి ప్రయత్నాలు చేసేవారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఏపీలో టీడీపీ, బీజేపీ.. కూటమి ఏర్పాటులో జనసేన అధినేత పవన్ కీరోల్ ప్లే చేశారనేది ఓపెన్ సీక్రెట్. ఈ విషయంపై పవన్ కూడా పలుసార్లు క్లారిటీ ఇచ్చారు. అదే పవన్ కల్యాణ్ ఇప్పుడు కూటమి లాంగ్ లీవ్ అని పదేపదే చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెక్స్ట్ డే నుంచే పవన్ ఈ స్లోగన్‌ను బలంగా వినిపిస్తున్నారు. చాలాకాలం పాటు కూటమి అధికారంలో కొనసాగాలని, అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షిస్తున్నారు. లేటెస్ట్‌గా పిఠాపురంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో కూడా ఆయన ఇదే అంశాన్ని మరోసారి గుర్తు చేయడం ఆసక్తికరంగా మారింది.రాజకీయ ప్రత్యర్థులు అధికార పక్షాన్ని బలహీనపర్చాలని కోరుకోవడం, ప్రయత్నించడం కామనే. ఈ క్రమంలో గతంలోనే వైసీపీకి తేల్చి చెప్పారు పవన్. మీరెన్ని ప్రయత్నాలు, కుట్రలు చేసినా కూటమిని విడదీయలేదరని గతంలోనే పలుసార్లు ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. అయితే ఈ సారి పవన్ వార్నింగ్‌లు మాత్రం బయటి వాళ్లకంటే.. సొంత పార్టీ నేతలకే ఎక్కువ తాకుతున్నాయట. కూటమిలో ఉన్న మూడు పార్టీల మధ్య పైస్థాయిలో సఖ్యత ఉన్నా, గ్రౌండ్ లెవెల్‌లో సమన్వయం లోపించిందన్న ప్రచారం ఉంది. అక్కడక్కడ లీడర్ల ఆధిపత్య పోరు, హవా చూపించాలన్న ప్రయత్నాలతో ఐక్యతకు ముప్పుగా మారొచ్చన్న ఆందోళన ఉంది. ఈ క్రమంలోనే కిందిస్థాయి కార్యకర్తలు, నేతలకు క్లియర్ కట్ ఇండికేషన్ పంపించేందుకే పవన్ ఇలాంటి స్టేట్‌మెంట్ ఇచ్చారంటున్నారు.

**ఆ రెండు జిల్లాలు...**

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి నేతల మధ్య విభేదాలున్నాయి. టీడీపీ అత్యధిక స్థానాల్లో గెలిచింది. జనసేన కేవలం 21 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. 175 నియోజకవర్గాల్లో 21 నియోజకవర్గాలంటే లెక్కలో పెద్ద అంకె కాదన్నది అందరికీ తెలుసు. కానీ పవన్ కల్యాణ్ మాత్రం ఆ ఇరవై ఒక్క నియోజకవర్గాలు మాత్రమే కాకుండా మిగిలిన నియోజకవర్గాల్లో కూటమి నేతల మధ్య నెలకొన్న విభేదాలను గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే పవన్ కల్యాణ్ ఎప్పటిలాగానే ఆ రెండు జిల్లాలకే పరిమితమయి తన రాజకీయాలు చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ తరచూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు అప్పుడప్పుడు గిరిజన ప్రాంతాలకు వెళ్లి వస్తున్నారు.కూటమి నేతల మధ్య విభేదాలను పరిష్కరించుకోవడానికి ఎన్నికల ముందు నుంచే అన్ని పార్టీలతో కలసి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఒకటి, జిల్లా స్థాయిలో మరొక సమన్వయ కమిటీలు ఏర్పడ్డాయి. కానీ రెండేళ్లవుతున్నప్పటికీ ఈ జిల్లా సమన్వయ కమిటీ కానీ, రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ కానీ కలసి కూర్చుని చర్చించలేదు. విభేదాలపై దృష్టి పెట్టలేదు. ఎన్నికలకు ఇంకా సమయం ఉందని పవన్ కల్యాణ్ అనుకుంటూ ఉండవచ్చు. కానీ అప్పటికి నేతల మధ్య గ్యాప్ పెరిగి పూడ్చలేనంతగా తయారవుతుందని, మొగ్గలోనే విభేదాలను తుంచేస్తే కూటమి పదికాలాల పాటు పదిలంగా ఉంటుందన్న సూచనలు వెలువడుతున్నాయి. గ్యాప్ పెరిగే కొద్దీ పార్టీని వీడే వారి సంఖ్య కూడా ఎక్కువవుతుందన్న విషయాన్ని గ్రహిస్తే మంచిది.

# క్షుద్ర రాజకీయాలు మానుకోకుంటే నీకు రాజకీయ గల్లంతే

-మొదటిపేజీ తరువాయి

నాయకుడు హరీష్ రావు అంటుంటే వైసీపీ బ్యాచ్ ఎందుకు ఖండించలేదు... బీఆర్ఎస్ నేతలతో వారికున్న చీకటి ఒప్పందం ఏమిటి..? .. ఇలా కుట్ర రాజకీయాలకు పాల్పడితే ఇప్పుడున్న 11 సీట్లు కూడా గల్లంతై... నీ చేతిలో ప్రజలు గుండు సున్నా పెట్టడం ఖాయం' అని జగన్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలోగాని, నదుల అనుసంధానంలో గాని సీఎం చంద్రబాబు పాత్ర మరువలేనిదన్నారు. ముఖ్యంగా రాయలసీమను సస్యశ్యామలంగా చేయడానికి ఆయన రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణాలోని రాజకీయ పక్షాలు తమ ఉనికి కోసం సీఎం చంద్రబాబు పేరును పావుగా చేసుకుని క్షుద్ర రాజకీయాలు చేస్తున్నాయన్నారు. రాయలసీమ బిడ్డగా వాటిని ఖండించాల్సిన జగన్, తన కరపత్రం మీడియా ద్వారా సీఎం చంద్రబాబుపైనా, కూటమి ప్రభుత్వంపైనా విషం కక్కుతున్నారన్నారు.

**బీఆర్ఎస్ నేతలతో జగన్ కున్న ఒప్పందం ఏమిటి..?**

కోర్టులో కేసుల వేసి, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తానే ఆపించానని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు ప్రకటించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. హరీష్ రావు వ్యాఖ్యలపై జగన్ గాని, ఆయన బ్యాచ్ గాని ఎందుకు స్పందించలేదని స్పందించలేదన్నారు. రాయలసీమకు జలాలివ్వకుండా బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతుంటే, జగన్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. వారితో జగన్ కున్న చీకటి ఒప్పందం ఏమిటని నిలదీశారు. బీఆర్ఎస్ నేతలతో జగన్ కు విడదీయరాని బంధం ఉందంటూ, తాడేపల్లిలోని ఆయన ప్యాలెస్ ముందు కేసీఆర్ తో కలిసి ఉండే భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారని తెలిపారు.

**రాయలసీమకు వరద జలాలివ్వడం అన్యాయమా..?**

వెనుకబడిన రాయలసీమను సస్య శ్యామలం చేయడానికి సీఎం చంద్రబాబునాయుడు సముద్రంలో కలిసిపోతున్న గోదావరి వరద జలాలివ్వాలని సంకల్పించారని మంత్రి సవిత తెలిపారు.

# రాజధాని రచ్చ



**అమరావతి :** అమరావతి రాజధాని విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవలంబిస్తున్న తీరు రాజకీయ వర్గాల్లోనే కాకుండా సామాన్య ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒక ప్రధాన రాజకీయ పార్టీ రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశంపై కాలక్రమేణా తన వైఖరిని మార్చుకుంటూ రావడం, ఆ పార్టీ రాజకీయ పరిపక్వతను , విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోంది.రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాక్షిగా అమరావతిని రాజధానిగా నిర్ణయించినప్పుడు, అప్పటి ప్రతిపక్ష నేతగా జగన్ మోహన్ రెడ్డి హృదయపూర్వకంగా ఆమోదం తెలిపారు. రాజధాని కనీసం 30 వేల ఎకరాల్లో ఉండాలి, అప్పుడే అది మహా నగరమవుతుంది అని ఆనాడు ఆయన చేసిన ప్రసంగాలు నేటికీ రికార్డుల్లో ఉన్నాయి. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే 33 వేల ఎకరాల సేకరణను తప్పుబట్టడం, దానిని ఒక రియల్ ఎస్టేట్ కుంభకోణంగా చిత్రించడం ప్రజల్లో మొదటి అనుమాన బీజాన్ని నాటింది. 2019 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు కంటే గొప్పగా అమరావతిని నిర్మిస్తాం అని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్, అనూహ్యంగా మూడు రాజధానుల నినాదాన్ని తెరపైకి తెచ్చారు. వికేంద్రీకరణ పేరుతో అమరావతిని కేవలం శాసన రాజధాని కే పరిమితం చేయడం వల్ల వేల సంఖ్యలో రైతులు రోడ్డున పడ్డారు. ఐదేళ్ల పాటు అభివృద్ధిని పూర్తిగా నిలిపివేసి, న్యాయస్థానాల్లో కేసులు వేస్తూ కాలయాపన చేయడం వల్ల రాజధాని ప్రాంతం ఒక శిథిలారణ్యంగా మారిందిమూడు రాజధానుల విధానానికి మద్దతు లభించలేదు. ఎన్నికల్లో మునుపెన్నడూ లేని విధంగా 11 సీట్లకు పడిపోయిన తర్వాత, వైసీపీ తన పంథాను మార్చుకున్నట్లు కనిపించింది. మళ్ళీ తాము కూడా అమరావతినే రాజధానిగా కొనసాగిస్తామని సజ్జల ప్రకటించారు. కానీ ఇప్పుడు కొత్తగా అమరావతిని నదీగర్భంలో కడుతున్నారంటూ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు మరో కొత్త గందరగోళానికి తెరలేపాయి. రివర్ బేసిన్ అంటే ఏమిటో స్పష్టత లేకుండా ఇటువంటి ఆరోపణలు చేయడం కేవలం అభివృద్ధిని అడ్డుకోవడమేనని విమర్శలు వస్తున్నాయి. గతంలో ఇదే అమరావతిలో తన నివాసాన్ని నిర్మించుకున్నప్పుడు లేని పర్యావరణ ముప్పు, ఇప్పుడు ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటేనే కనిపిస్తోందా అని సామాన్య జనం ప్రశ్నిస్తున్నారు. రాజకీయాల్లో వ్యూహాలు మారవచ్చు కానీ, ఒక రాష్ట్ర మనుగడకు సంబంధించిన ప్రాజెక్టుపై విధానం మాటిమాటికీ మారకూడదు. జగన్ , వైసీపీ అనుసరిస్తున్న ఈ “యూ-టర్న్” రాజకీయం వల్ల ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకం సడలుతోంది. ఒకసారి రాజధాని అని, మరోసారి కాదని, మళ్ళీ అవునని, ఇప్పుడు మునిగిపోతుందని చెప్పడం ద్వారా వైసీపీ తన సొంత కేడర్‌ను కూడా అయోమయంలో పడేస్తోంది. నిత్యం మాట తప్పను.. మడమ తిప్పను అని చెప్పే నాయకుడు, రాజధాని విషయంలో ఇన్నిసార్లు మాట మార్చడం ఆయన రాజకీయ జీవితంలో ఒక పెద్ద మైనస్‌గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజలు రాజకీయ పార్టీల నుంచి ఆశించేది స్థిరత్వం. ఈ గందరగోళం ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో కూడా ప్రజల నుంచి సానుకూల స్పందన రావడం కష్టమే. ఇప్పటికైనా విమర్శల కోసం విమర్శలు మానేసి, నిర్మాణాత్మకమైన వైఖరిని అవలంబించడమే ఆ పార్టీకి శ్రేయస్కరం అనేది ఎక్కువ మంది భావన.

# ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థుల ప్రతిభ

-మొదటిపేజీ తరువాయి

107 మంది విద్యార్థులు ఎస్సెస్సీ మరియు ఇంటర్మీడియట్‌లో జిల్లా మరియు మండల స్థాయి మెరిట్ అవార్డులను అందుకున్నారు, వీరికి రూ. 19.35 లక్షల ప్రోత్సాహకాలు అందించబడ్డాయి. ఎస్సెస్సీలో 585 పైబడి మార్కులు ఇంటర్మీడియట్‌లో 983 పైబడి మార్కులు సాధించిన 82 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో సన్మానించారు. ఎ 55 మంది విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు మరియు ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు పొందారు, వీరికి గౌరవ ముఖ్యమంత్రి గారు ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున బహుమతిగా అందించారు. 116 మంది విద్యార్థులు ఆర్జీయుకెటిలలో ప్రవేశాలు పొందారు. అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం సహకారంతో ప్రిన్సిపాల్‌లకు నాయకత్వ శిక్షణ మరియు ఉపాధ్యాయులకు సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు అమలు చేయబడ్డాయి. కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సహకారంతో మూడు సంవత్సరాల ఇంగ్లీష్ కమ్యూనికేటివ్ స్కిల్స్ ప్రోగ్రామ్ అమలు చేయబడింది. మౌలిక సదుపాయాల అభివద్ధి కోసం రూ. 79.18 కోట్లు మంజూరు చేయబడ్డాయి.

# నిధులు పొందిన రాష్ట్రాల్లో ఏపీ మూడోది

-మొదటిపేజీ తరువాయి

మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. మిగిలిన నిధుల విడుదల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో తక్షణమే చర్చించాలని ఉన్నతాధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. పూర్తి స్థాయిలో కేంద్ర సాయం సాధించాలని వారికి మంత్రి స్పష్టం చేశారు. ఈ కూటమి ప్రభుత్వ హయాంలో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం పెరగడంపై కేంద్రం సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వ కృషిని ఈ సందర్భంగా కేంద్రం గుర్తించిందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తి స్థాయిలో పొందిన జాబితాలో ఆంధ్రప్రదేశ్ మూడో రాష్ట్రంగా ఉందన్నారు. దీనిపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ హర్షం వ్యక్తం చేశారు

# ఏపీలో ఎక్కడ చూసినా సంక్రాంతి శోభ

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సందడి ఈసారి సరికొత్త శోభను సంతరించుకుంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పండుగ అంటే కేవలం కాసినోలు, కోడి పందాలు, జూద వినోదాలే అన్నట్లుగా సాగిన పరిస్థితి నుంచి, నేడు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రం కళకళలాడుతోంది. పాలకుల ఆలోచనా ధోరణి మారితే ప్రజల ఉత్సాహం ఎలా ఉంటుందో ప్రస్తుత ఏపీ వేడుకలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.రాజధాని అమరావతి పరిధిలోని విజయవాడ పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో ప్రభుత్వం ఆవకాయ్-అమరావతి సినిమా, సంస్కృతి, సాహిత్యోత్సవం నిర్వహిస్తోంది. తెలుగువారి ఐకానిక్ రుచి ఆవకాయ పేరుతో జరుగుతున్న ఈ వేడుకల్లో సాహిత్యం, కళలు, సినిమా విశ్లేషణలు , సాంస్కృతిక కార్యక్రమాలతో కృష్ణమ్మ తీరం ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యానికి వేదికైంది. జూదానికే పరిమితం కాకుండా, తెలుగు మేధో సంపత్తిని ప్రపంచానికి చాటాలనే లక్ష్యం ఇక్కడ కనిపిస్తోంది.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గమైన పిఠాపురాన్ని పీఠికాపురం పేరిట ఆధ్యాత్మిక, సంప్రదాయ వేడుకలకు కేంద్రంగా మార్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సంక్రాంతి మహోత్సవంలో గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలు, జానపద కళారూపాలతో పాతకాలపు పల్లెటూరి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. పీఠికాపురం పురావైభవాన్ని గుర్తు చేస్తూ సాగుతున్న ఈ వేడుకలు స్థానికుల్లో అపూర్వమైన ఉత్సాహాన్ని నింపాయి.గతంలో పండుగ రోజుల్లో అశ్లీల నృత్యాలు, అక్రమ జూద కేంద్రాలతో భయానక వాతావరణం ఉండేదన్న విమర్శలు ఉండేవి. కానీ ఇప్పుడు ప్రభుత్వం అధికారికంగా సాంస్కృతిక ఉత్సవాలను ప్రోత్సహిస్తుండటంతో సామాన్య ప్రజలు కుటుంబాలతో కలిసి పండుగను ఆస్వాదిస్తున్నారు. హరిదాసుల దీవెనలు, ముగ్గుల పోటీలు, సంప్రదాయ వంటకాలతో ప్రతి ఇల్లు ఒక కళానిలయంగా మారింది. ఇది కేవలం పండుగ మార్పు మాత్రమే కాదు, రాష్ట్రంలో వచ్చిన పాలనాపరమైన మార్పుకు ప్రతిబింబం. ఏపీలో ఇప్పుడు కనిపిస్తున్న సంక్రాంతి కళ కేవలం వినోదం కోసం మాత్రమే కాదు

# అసెంబ్లీలో రప్పా...రప్పా రాజకీయం

**నెల్లూరు :** అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఫిబ్రవరిలో జరగనున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతోంది. ప్రతిపక్ష హోదా ఇవ్వనిదే సభకు హాజరుకామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. ఇప్పటికీ అదే స్టాండ్ తో ఉంది. మరోవైపు వరుసగా పని దినాలు కలుపుకొని శాసనసభకు 60 రోజులపాటు హాజరు కాకుంటే ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు పడే అవకాశం ఉంది. ఇప్పటికే శాసనసభ ఎథిక్స్ కమిటీ సమావేశం జరిగింది. వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరుపై చర్చించారు. ప్రభుత్వానికి నివేదించనున్నారు. స్పీకర్ ద్వారా మరోసారి నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. సాధారణంగా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నవంబర్ నుంచి జనవరి మధ్య జరగాలి. కానీ ఈసారి ఆలస్యం జరిగింది. ఫిబ్రవరిలో సమావేశాలు ఉంటాయని తెలుస్తోంది. దాదాపు పది రోజులపాటు సభను కొనసాగించాలని స్పీకర్ నిర్ణయించినట్లు సమాచారం.అయితే ఈసారి కూటమి ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. గడిచిన ఏడాదిన్నర కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి సమగ్రంగా వివరించనున్నారు ఈ సభ ద్వారా. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్, విశాఖలో పరిశ్రమల ఏర్పాటు, ఏపీకి భారీగా వస్తున్న ప్రాజెక్టులు, తయారీ రంగం పరిశ్రమలు.. ఇలా ప్రతి అంశం గురించి సమగ్రంగా చర్చించే వీలుగా సభలు ఉండనున్నాయి. అర్థవంతమైన చర్చకు తెర లేపనున్నారు. ముఖ్యంగా విపక్ష పాత్రను కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలు పోషించనున్నారు. ప్రజల తరపున బలమైన వాయిస్ వినిపించి ప్రభుత్వం నుంచి సమాధానాలు రాబట్టనున్నారు. అందుకే లోతైన అధ్యయనం చేయాలని పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు సూచించారు. మంత్రులు కూడా సమగ్ర వివరాలతో సభకు హాజరుకావాలని ఇప్పటికే సంకేతాలు పంపించారు.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన నాటికి రాష్ట్ర పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉంది అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ఇచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఇటీవల పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ దేశంలోనే ప్రథమ స్థాయిలో నిలిచింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలకు వచ్చిన పెట్టుబడుల ప్రతిపాదనల్లో.. 25% ఏపీకి రావడం నిజంగా శుభపరిణామం. ఇందులో సగం పెట్టుబడులు వచ్చిన ఏపీ అభివృద్ధి సాధించినట్టే.


## సంపాదకీయం

# అందరి చూపు మోడీ వైపు

ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డ చందంగా మారింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిస్థితి.. రష్యా?ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి ఇప్పుడు భారత్‌పై బాంబు పేల్చాలని నిర్ణయించాడు. రష్యాను ఒప్పించడమో.. ఢీకొనడం సాధ్యం కాక.. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్న భారత్‌పై భారీగా టారిఫ్ విధించేందుకు పావులు కదుపుతున్నారు. రష్యాపై ఒత్తిడి పెంచేందుకు ద్వైపాక్షిక ఆంక్షల చట్టానికి అంగీకారం తెలిపారు. సెనేటర్ గ్రాహం ఎక్స్‌లో పోస్ట్ పెట్టి ట్రంప్‌తో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాలు విధించే అధికారాన్ని యుఎస్ పొందుతుంది. వచ్చే వారంలో ఓటింగ్ జరుగనుంది. పుతిన్ యుద్ధానికి పరోక్షంగా నిధులు అందించడానికి భారత్, చైనా కారణమని ట్రంప్ ఆరోపణ. చైనా ప్రపంచంలోని అతిపెద్ద రష్యన్ చమురు కొనుగోలుదారు, భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ ఆంక్షలు రక్తపాతానికి మద్దతును కట్టడి చేస్తాయని గ్రాహం వాదన. గతేడాది భారత దిగుమతులపై 50 శాతం సుంకాలు విధించినట్లే ఇప్పుడు మరింత గట్టిగా ఉంటుంది. భారత్?అమెరికా మధ్య వాణిజ్య ఒప్పంద చర్చలు కొనసాగుతున్నాయి. ఈ బిల్లు ఆంక్షలు ఈ సంభాషణలను ప్రభావితం చేస్తాయి. భారత్ ఆర్థిక వ్యవస్థకు చమురు ధరల పెరుగుదల భారాన్ని మోపవచ్చు. పుతిన్ శాంతి మాటలు చెబుతూనే యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని గ్రాహం విమర్శించారు. ఈ ఆంక్షలు మాస్కో ఆదాయాలను తగ్గించి ఉక్రెయిన్‌కు మద్దతును బలోపేతం చేస్తాయి. బ్రెజిల్ వంటి ఇతర దేశాలు కూడా ఈ జాబితాలో చేరతాయి. ఈ చర్య భారత్‌కు రష్యన్ చమురు ఆధారాన్ని ప్రశ్నిస్తుంది. ప్రత్యామ్నాయ మూలాలు కనుగొనడం, యుఎస్‌తో దౌత్య చర్చలు జరపడం అవసరం. ట్రంప్ విధానం ఉక్రెయిన్ యుద్ధాన్ని త్వరగా ముగించే అవకాశాన్ని కల్పిస్తుంది. కానీ ఆర్థిక సవాళ్లను తెచ్చిపెడుతుంది. ట్రంప్ పాలిటిక్స్‌లో కొత్త మలుపు ఇది. వెనుజువెలాలోకి అమెరికా సైనికులను పంపించి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో ఆ దేశంలోని చైనా, రష్యా డిఫెన్స్ సిస్టం విఫలమయ్యాయి. దీంతో అమెరికా ఆపరేషన్ విజయవంతమైంది. దీంతో ట్రంప్‌కు అహంకారం తలకెక్కింది. దీంతో క్యూబా, ఇరాన్, కొలంబియా, మెక్సికోతోపాటు భారత్‌ను టార్గెట్ చేశారు. వెనెజువెలాలో మదురో దంపతులను లక్ష్యంగా చేసుకుని యుఎస్ విజయవంతమైంది. రష్యా ఎస్?300, చైనా రాడార్లు అమెరికా చొరబాటును పసిగట్టలేకపోయాయి. దీంతో యుఎస్ ఆయుధాల ఆధిపత్యాన్ని నిరూపించింది. ఈ సంఘటన ఆయిల్ వనరులపై యుఎస్ ఆకాంక్షలను స్పష్టం చేస్తోంది. వెనుజువెలాలోని 303 బిలియన్ బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్‌ను తరలించుకుపోవడానికి యుఎస్ కంపెనీలను ట్రంప్ ప్రోత్సహిస్తున్నారు. వెనుజువెలాలో విజయం తర్వాత ట్రంప్ ఇప్పుడు మరో ఐదు దేశాలపై ఫోకస్ పెట్టాడు. వెనెజువెలాపై ఆధారపడి ఉన్న క్యూబాను త్వరగా కూల్చివేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయిల్ సరఫరాలు ఆగిపోతే ఇది సులభమవుతుందని వ్యూహం. అందుకే క్యూబాను ఫస్ట్ టార్గెట్ చేశారు. క్యూబాకు చెందిన మచాడో కూడా అమెరికాకు మద్దతు ఇస్తున్నారు. ఇరాన్‌పై మునుపటి దాడుల్లోనూ రష్యన్ టెక్నాలజీ విఫలమైంది. కొలంబియా అధ్యక్షుడు పెట్రోతో మాటల యుద్ధం ఉధృతమైంది. ఈ దేశాల్లో పాలన మార్పులు లక్ష్యంగా యుఎస్ ఒత్తిడి పెరుగుతోంది. కానీ పెట్రో బలంగా నిలబడ్డారు. ట్రంప్‌కు సవాల్ చేస్తున్నారు. అయితే కొలంబియా మెక్సికో పక్కనే ఉంది. అందుకే దానిని కూడా ఆక్రమించి చూస్తున్నారు. అమెరికా కోర్టుల ప్రకారం ఇవి తప్పు చేస్తున్నాయి కాబట్టి అక్కడి ప్రభుత్వాలను కూలుస్తామని ట్రంప్ అంటున్నారు. అక్రమ వలసలు, మాదకాలు కారణంగా మెక్సికోను లక్ష్యంగా చేసుకుని యుఎస్ సైనిక చర్యలు ఆలోచిస్తోంది. సరిహద్దు భద్రతకు ఇది ముఖ్యమని ట్రంప్ వాదన. నాటో సభ్య దేశమైన డెన్మార్క్ భూభాగం గ్రీన్‌లాండ్‌ను యుఎస్ కోరుతోంది. భద్రతా కారణాలతో ఈ డిమాండ్ ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం. ఇది యుఎస్ ప్రభావాన్ని ఈ ప్రాంతంలో విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. ట్రంప్?మోదీ మధ్య వ్యాఖ్యలు ఉధృతమవుతున్నాయి. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు, టారిఫ్‌లు, మొక్కజొన్న వ్యాపారం విషయాల్లో యుఎస్ ఒత్తిడి పెరిగింది. షెల్ ఆయిల్ కొనుగోళ్లకు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. భారత్ మౌనంగా ఉండి స్వంత ఆస్థాను కాపాడుకుంటోంది. యుఎస్ ఆయుధాలు అమ్మకాలకు ఈ సంఘటనలు ప్రచారం చేస్తున్నాయి. మన దేశం మీద అమెరికా ఇప్పటికే 50% టారిఫ్ విధిస్తోంది. అప్పట్లో అమెరికా తీసుకున్న నిర్ణయం వల్ల భారత్ కుప్పకూలుతుందని అందరూ అనుకున్నారు. వారు అనుకున్నట్టుగానే స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోయింది. సంపద మొత్తం ఆవిరి అయిపోయింది. ఆ తర్వాత నెమ్మదిగా పరిస్థితి మారిపోయింది. అప్పటి మాదిరిగా కాకపోయినప్పటికీ, అమెరికాకు భారత్ నుంచి ఎగుమతులు వెళ్తూనే ఉన్నాయి. వాస్తవానికి ఈ సుంకాల వల్ల అమెరికాలో ఉన్న కస్టమర్ల మీదనే భారం ఎక్కువగా పడుతుంది. ట్రంప్ వల్ల అమెరికాలో ఆ వస్తువులను కొనేవారికి ఆర్థికంగా భారం పెరిగింది. ఈ ఎఫెక్ట్ ఇండియన్ కంపెనీల ఎగుమతుల మీద కాస్త ప్రభావం చూపించింది. అంతేగాని ఆ సంస్థలు భారీగా నష్టాలు చవిచూసిన దాఖలాలు లేవు. ఇప్పుడు ట్రంప్ చెబుతున్నట్టుగా 500% సుంకాలు విధించినప్పటికీ ఎగుమతులు కాస్తలో కాస్త క్షీణిస్తాయి. అయితే అమెరికా మార్కెట్లో భారతదేశం నుంచి వచ్చే వస్తువుల ధర పెరుగుతుంది. అలాంటప్పుడు అమెరికా ప్రజలు వాటిని ఒకవేళ ఎంచుకుంటే.. పెద్దగా ఇబ్బంది ఉండదు. అలాంటప్పుడు ట్రంప్ వెయ్యి శాతం సుంకాలు విధించినప్పటికీ పెద్దగా ఇబ్బంది ఉండదు. కాకపోతే అమెరికాకు భారత్ నుంచి ఎగుమతి వస్తువుల పరిమాణం తగ్గుతుంది.. 500% సుంకాలు విధిస్తామని ట్రంప్ చెప్పగానే భారత్ లోని స్టాక్ మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. 8 లక్షల కోట్లు ఆవిరి అయిపోయాయి. వాస్తవానికి ఈ నష్టం స్టాక్ మార్కెట్ చరిత్రలో కొత్తది కాకపోయినప్పటికీ.. ట్రంప్ కు భయపడడం మొదలైతే.. అలానే ఇబ్బంది పెడుతూనే ఉంటాడు. కాస్త నిలబడి గట్టి సవాల్ విసిరితే అన్నీ మూసుకొని కూర్చుంటాడు. మోదీ తనను బతిమాడుతున్నాడని ట్రంప్ చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మోదీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మోదీ నిర్ణయంపైనే భారత ఎగుమతులు ఆధారపడి ఉంటాయి.

## పురాణ పురుషులు...

# మల్లాది చంద్ర శేఖరులు



ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే. ధర్మసందేహాలు కార్యక్రమం లో శ్రోతల సందేహాలకు సమాధా నాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిం దే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ద ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి. మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారా వ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్ర దాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్ష సంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచు కున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు. తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వాఙ్మయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్ళారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి,స్వాముల వారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్పావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరూ తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవ శాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం. వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుం డడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టు బట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహు ళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖర శాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా-లక్ష్మీ అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతో త్తములు చంద్రశేఖర శాస్త్రి... 96 ఏళ్ళ వయసులో జనవరి 14, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

# హాస్య రస గుళికలు...జంధ్యాల రచనలు



జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ఈ పేరు తెలుగు ప్రజలకు దాదాపు తెలియ దనే చెప్పాలి. కనీసం ఆ పేరు గల వ్యక్తి ఉన్నారని గాని, ఆయన సుపరిచితు లేనని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అత్యంత ప్రజా దరణ పొందిన విజయ వంతమైన సినిమాలకు కథలు, ఆకట్టుకునే సంభాషణలు సమకూర్చారని, చిర కాలం గుర్తుండి పోయే చిత్రాలకు దర్శకత్వం వహించారని సినిమాల తో పరిచయం, సంబంధం ఉన్నా చాలా మందికి తెలియదు. ఆయనే ..హాస్యబ్రహ్మ గా పేరు పొంది, ఇంటి పేరుతో ప్రఖ్యాతి గాంచిన వెండితెర హాస్య బ్రహ్మ జంధ్యాల. జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి (జనవరి 14, 1951 – జూన్ 19, 2001 ) తెలుగు సినిమా రచయిత, దర్శకులు. జంధ్యాల అని ఇంటి పేరు తోటే సుప్రసిద్ధుడైన ఆయన అసలుపేరు జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ప్రత్యేకించి హాస్యకథా చిత్రాలు తీయ టంలో ఆయనది అందె వేసిన చెయ్యి. జంధ్యాల చెప్పిన ప్రసిద్ధ వాక్యం - నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వక పోవడం ఒక రోగం. అనేది నానుడి. జంధ్యాల 1951 జనవరి 14 న పశ్చిమ గోదావరి జిల్లా నరసా పురంలో జన్మించాడు. బి.కామ్ వరకు చదువు కున్నారు. చిన్న తనం నుండి నాటకాల పట్ల ఆసక్తి గా ఉండేవారు. స్వయంగా నాటకా లు రచించారు. ఆయన రాసిన నాటకాల్లో "ఏక్ దిన్ కా సుల్తాన్, గుండెలు మార్చబడును" ప్రముఖ మైనవి. ఆయన నాటకాలు అనేక బహుమతులు అందుకున్నాయి. 1974లో జంధ్యాల సినిమా రంగ ప్రవేశం చేసారు. శంకరాభరణం, సాగర సంగమం, అడవి రాముడు, వేటగాడు వంటి అనేక విజయ వంతమైన సినిమాలకు మాటలు రాశారు. ముద్ద మందారం సినిమా తో దర్శకుడిగా మారి, శ్రీవారికి ప్రేమలేఖ వంటి చిరస్మరణీయ చిత్రాన్ని సృజించారు. 1976 లో దేవుడు చేసిన బొమ్మలు చిత్రం ద్వారా మాటల రచయితగా తన సినిమా జీవితం మొదలు పెట్టారు. ఐదేళ్ళలో సుమారు 85 సినిమాలకు రచయితగా పని చేయగా అందులో 80 శాతం సినిమాలు ఘనవిజయం సాధిం చడంతో మంచి రచయితగా పేరు తెచ్చుకున్నారు. తరువాత దర్శకు డిగా మారి, అనేక హాస్య చిత్రాలను రూపొందించారు. ఆరోగ్య కరమైన హాస్యానికి జంధ్యాల పేరు గాంచారు. హాస్యబ్రహ్మ అని పేరు పొందారు. రచయితగా 300కు పైగా సినిమాలు, దర్శకుడు గా షుమారు 50 సినిమాలు చేసారు. అప్పటి కామెడీ హీరోలకు లైఫ్ ఇచ్చాయి ఈయన సినిమాలు. ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించారు. శ్రీలక్ష్మి, బ్రహ్మానందం లాంటి వారిని ఈ రోజుకి ప్రేక్షకులు గుర్తుంచు కున్నారంటే ఆయన సినిమాలే కారణమనేది వాస్తవం. జంధ్యాల కేవలం హాస్యమే కాకుండా అన్ని రకాల ఎమోషన్స్ రచించే వారు. అజరామర 'శంకరా భరణం' చిత్రంతో పాటు 'సప్తపది' జంధ్యాల రచనకు తార్కాణాలుగా నిలిచాయి. సినిమా పరిశ్రమలో జంధ్యాల, కె.రాఘవేంద్రరావుల కాంబినేషన్ కు విశేష ప్రత్యేకత ఉంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'అడవి రాముడు', 'వేట గాడు', 'డ్రైవర్ రాముడు', 'జగదేక వీరుడు అతిలోక సుందరి' వంటి చిత్రాలను జన రంజకంగా రూపొం దించడంలో జంధ్యాల పాత్ర కీలకంగా నిలిచింది. అలాగే కె.విశ్వ నాథ్, జంధ్యాల కాంబినేషన్ కూడా సూపర్‌హిట్ చిత్రాలకు పెట్టింది పేరు. ఈ కాంబినేషన్‌లో 'శంకరా భరణం', 'సాగర సంగమం' వంటి చిత్రాలొచ్చాయి. దర్శకుడుగా ఆయన మొదటి సినిమా ముద్ద మందారం ఈరోజుకి అంత ఆదరణ పొందుతోంది అంటే ఆయన దర్శ కత్వ ప్రతిభే. కామెడీ చిత్రాలకు ఎక్కువగా పని చేసిన జంధ్యాల వేగవంతమైన రచయితగా పేరు తెచ్చు కున్నారు. పది రోజుల్లో సినిమాకు మాటలు రాసేవారు. ఆయన కళాత్మక చిత్రా లకు ఎంత హృద్యంగా రాశారో, హాస్య భరిత చిత్రాలకు అంత చిలిపిగా రాశారు. 1983లో, "ఆనంద భైరవి" చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రం దర్శకుడు జాతీయ అవార్డు, 1983లో, "ఆనంద భైరవి" చిత్రానికి ఉత్తమ దర్శకుడు నంది అవార్డు, 1987లో, "పడమటి సంధ్యారాగం" చిత్రానికి ఉత్తమ కథారచయిత అవార్డు, 1992లో, "ఆపద్బాంధవుడు" చిత్రానికి ఉత్తమ మాటల రచయిత అవార్డు లభించాయి. జంధ్యాల తన సినిమాల ద్వారా అనేక మంది నటులను... బ్రహ్మా నందం, నరేష్, ప్రదీప్, సుత్తి వీరభద్రరావు, సుత్తి వేలు తదితర నటీనటులను జంధ్యాల సినీ రంగానికి పరిచయం చేశారు. ఇంటి పేరు తోటే ప్రసిద్ధుడైన జంధ్యాలను మీ అసలు పేరు ఏమిటి అని అడిగితే ఆయన ఇలా అనేవాడు: "నేను రామానాయుడి సినిమాకు పనిచేసేటపుడు నాపేరు జంధ్యాల రామానాయుడు, విశ్వనాథ్ గారి సినిమాకు పనిచేసే టపుడు నా పేరు జంధ్యాల విశ్వనాథ్"... అలా అనేవారు తప్ప, తన అసలుపేరు ఎక్కడా చెప్పు కోలేదు. జంధ్యాల 2001 జూన్ 19 న హైదరాబాదులో గుండె పోటుతో మరణించారు. ఆయనకు ఇద్దరు కూతుర్లు.... పేర్లు సాహితి, సంపద.

# సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సత్య కుమార్ యాదవ్

ప్రశాంతంగా సంక్రాంతి జరుపుకుందాం మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపు

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండండి మంత్రి సత్య కుమార్ యాదవ్ విజ్ఞప్తి

శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి మంత్రి సత్య కుమార్ యాదవ్ సూచన





**ధర్మవరం, జనవరి 13:బహుజన వేదిక న్యూస్** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం ధర్మవరం పట్టణంలోని గవర్నమెంట్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలు సంప్రదాయ క్రీడల పోటీలు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర వైద్య & ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ గారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ భోగి మంటలు, పాల పొంగులు, హరిదాసుగంగిరెద్దు ప్రదర్శనలు, ఎద్దుల బండ్ల ప్రదర్శనలు, గ్రామీణ కుటీరాల ఏర్పాటు, సంప్రదాయ క్రీడల పోటీలు, ముగ్గుల పోటీలు, కీలు గుర్రాలు, గురవయ్యలు, ఊరుములు, చిల్ల కట్టె ఆటలు, కోడి పందాలు, రాతిదూలం లాగుట, ఇసుక సంచులను ఎత్తే పోటీలు తదితర పలు గ్రామీణ సంప్రదాయాలకు సంబంధించిన స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులకు అవసరమైన సూచనలు చేశారు. అన్ని ఏర్పాట్లు ప్రజలకు ఇబ్బంది లేకుండా, సురక్షితంగా, శుభ్రంగా, సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించే విధంగా ఉండాలని మంత్రి అధికారులను మరియు నిర్వాహకులను ఆదేశించారు. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు సైతం ఆనందంగా పాల్గొనేలా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ.... సంక్రాంతి మన సంస్కృతికి ప్రతీక. ఈ పండుగను ధర్మవరం నియోజకవర్గ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఒక ప్రశాంతమైన, సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలి. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా, సంప్రదాయాలను కాపాడుకుంటూ, పరస్పర సౌభ్రాతృత్వంతో పండుగను నిర్వహించుకోవాలని ప్రజలకు మనవి చేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై, మన సంప్రదాయాలను ఆనందంగా ఆస్వాదించాలని ఆయన కోరారు.

# ప్రజాసేవే పరమావధిగా సంపత్ విధుల్లో రాణింపు

## ఆత్మీయ అభినందన సభలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.



**ఓబుళదేవర చెరువు,జనవరి 13: బహుజన వేదిక న్యూస్** ప్రజా సేవయే పరమావధిగా ప్రభుత్వ విధుల్లో రాణిస్తే తగిన గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి డాక్టరు పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా విద్యుత్ సూపరిండెంట్ గా పనిచేస్తూ ప్రస్తుతం తిరుపతి చీఫ్ జనరల్ మేనేజర్ గా పదోన్నతి పొందిన సందర్భంగా పుట్టపర్తి సాయి అరామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. చిన్ననాటి నుంచి ఎంతో క్రమశిక్షణ కలిగిన విద్యార్థిగా ప్రజలతో ఎంతో ఆప్యాయత కలిగిన వ్యక్తిగా సంపత్ కుమార్ ఉన్నతస్థానంలో ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో రైతులకు సేవలు అందించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ సంస్థ ద్వారా రైతులకు వందలాది ట్రాన్స్ఫార్మర్లు , వ్యవసాయ కనెక్షన్లు సర్వీసుల మెటీరియల్ అందించారని పేర్కొన్నారు. అదే విధంగా సత్యసాయి బాబా శత జయంతి వేడుకల సందర్భంగా పుట్టపర్తిలో రూ. 5కోట్లతో విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి బాబా 100వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారన్నారు. సంపత్ కుమార్ ఇంత స్థాయికి రావడానికి ఆయన సతీమణి సహకారమే కారణం అన్నారు. క్షేత్ర స్థాయి అధికారి నుంచి డీఈ గా ,ఎస్ ఈ గా పనిచేస్తూ ప్రస్తుతం చీఫ్ జనరల్ మేనేజర్ గా సంపత్ కుమార్ ఉన్నతస్థాయికి ఎదగడం ఎంతో అభినందనీయం అన్నారు. సంపత్ ఎక్కడ ఉన్నా ఈ ప్రాంత అభివృద్ధికి , రైతులకు ప్రజా సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,ఆర్డీఓ సువర్ణ, సత్యసాయి ,అనంత ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ మోసెస్ ,శేషాద్రి ఈ ఈ శివరాముడు, డీ ఈ లు ఏఈఈ గౌరి శంకర, చంద్రా నాయక్ లు కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు సామకోటి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో వాహనమంటప శంకుస్థాపన చేసిన మంత్రి సత్య కుమార్ యాదవ్

ధర్మవరంలో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సత్య కుమార్ యాదవ్.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం మంత్రి సత్య కుమార్ యాదవ్.

రైతులను మోసం చేసిన వారే ఇవాళ నీతి మాటలు మాట్లాడుతున్నారు మంత్రి సత్య కుమార్ యాదవ్.

ప్రజలే గతంలో తీర్పు ఇచ్చారు, మళ్లీ ఇస్తారు మంత్రి సత్య కుమార్ యాదవ్.







**ధర్మవరం, జనవరి 13:బహుజన వేదిక న్యూస్** ధర్మవరం పట్టణం, కళ్యాణజ్యోతి సర్కిల్ సమీపంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో నిర్మించనున్న శ్రీ లక్ష్మీ రథ మండపం (నూతన వాహనమంటపము) నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా స్వామివారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో మంత్రి భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ... అత్యంత ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో శిథిలావస్థకు చేరుకున్న పాత వాహనమంటపాన్ని తొలగించి, భక్తుల సౌకర్యార్థం నూతన వాహనమంటపం నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషకరం. స్వామివారి కరుణ, కటాక్షాలు ధర్మవరం నియోజకవర్గ ప్రజలపై ఉండాలని, రైతుల పంటలు ఎటువంటి విపత్తులు లేకుండా సమృద్ధిగా పండాలని, యువతకు ఉపాధి అవకాశాలు కలగాలని, ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు మెరుగుపడాలని స్వామివారు ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. అదేవిధంగా ధర్మవరం నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ సంక్రాంతి ప్రతి ఇంటా సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు తీసుకురావాలని కోరుకుంటున్నాను అని అన్నారు. అనంతరం రైతుల సాగునీటి గురించి విలేకరులతో మాట్లాడుతూ.... రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా అవసరమైన నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గతంలో జిల్లేడు బండ రిజర్వాయర్ నిర్మాణంలో రైతుల భూములను అనుమతి లేకుండా స్వాధీనం చేసుకొని, సరైన పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారని విమర్శించారు. ప్రస్తుతం ఆ రైతులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రైతులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించిన తరువాతే ఏ ప్రాజెక్టు అయినా ముందుకు వెళ్తాం. రైతుల నోట్లో మట్టి కొట్టే విధానాలకు మా ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకం. సాగునీటి కాలువలు, గేట్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి నీటిని పొలాలకు అందిస్తున్నాం అని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తున్నారని ప్రశంసించారు. మంత్రి లోకేష్, పరిటాల శ్రీరామ్, చిలక మధుసూదన్ రెడ్డి తదితరుల సహకారంతో ధర్మవరం అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో నీటి ప్రాజెక్టులు, వ్యవసాయ రంగం పూర్తిగా నిర్లక్ష్యం పాలయ్యాయని, రైతులను తీవ్రంగా నష్టపరిచారని విమర్శించారు. ప్రజలు గతంలో శిక్షించారు, భవిష్యత్తులో కూడా నిజాన్ని గుర్తించి తగిన తీర్పు ఇస్తారు అని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నం శెట్టి జగదీష్, ఆలయ ఈవో వెంకటేశ్వర్లు, స్టూడియో రాము, పోరా ళ్ల ల్ల పుల్లయ్య బృందం, కొత్త హరి తదితరులు పాల్గొన్నారు.

## అడవి బ్రాహ్మణపల్లి తాండలో శ్రీ మారెమ్మ తల్లి జాతరలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

మారెమ్మ తల్లి జాతరలో పల్లకి సేవ చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**ముదిగుబ్బ, జనవరి 13:బహుజన వేదిక న్యూస్** ధర్మవరం నియోజకవర్గం, ముదిగుబ్బ మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తాండ గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీ మారెమ్మ తల్లి జాతర మహోత్సవంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా శ్రీ మారెమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి అమ్మవారికి విశేష పూజలు అర్పించారు. అనంతరం సంప్రదాయ పల్లకి సేవా కార్యక్రమంలో పాల్గొని గ్రామ ప్రజలతో కలసి జాతర ఉత్సవంలో భాగమయ్యారు. గ్రామ ప్రజలు సంప్రదాయాలను, ఆచారాలను పరిరక్షిస్తూ తరతరాలుగా కొనసాగిస్తున్న ఈ విధమైన జాతరలు మన సంస్కృతికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ జాతర గ్రామ ఐక్యతకు, సామాజిక సౌహార్ద్రానికి ప్రతీకగా నిలుస్తుందని, ఇటువంటి సంప్రదాయ వేడుకలు యువతకు మన మూలాలను గుర్తు చేస్తాయని తెలిపారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, గ్రామాల సంప్రదాయ సంస్కృతిని కాపాడటానికి కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు మంత్రివర్యులను ఘనంగా ఆహ్వానించి, సంప్రదాయ రీతిలో సత్కరించారు.

## పంటలకు యూరియా అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

రైతు సంఘం మండల కార్యదర్శి ఇరువెందుల కొండారెడ్డి



**శింగనమల జనవరి 13:బహుజన వేదిక న్యూస్** శింగనమల మండలం రాచేపల్లి గ్రామపంచాయతీలో వరి పంట ఎక్కువగా సాగు చేసుకుంటున్నారు. కానీ ఆ పంటకు అనుకూలంగా ఉన్నటువంటి యూరియా ఇతర మందులను సదుపాయం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడి ఉంది. యూరియా అందుబాటులో లేక , బయట ఎక్కడ అందుబాటులో లేక, ప్రభుత్వం సరైన సమయంలో ఇవ్వకుండా రైతులను ఇబ్బందికి గురిచేస్తుందని రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా రాష్ట్ర ప్రభుత్వం రాచేపల్లి గ్రామపంచాయతీ లో ఉన్నటువంటి రైతులకు యూరియా మందులను వెంటనే రైతుల అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేకపోతే రైతులందరినీ కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వంపై ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు

## రాచేపల్లి గ్రామంలో గత 5 రోజుల నుండి త్రాగునీరు లేని దుస్థితి

ఏ మాత్రం పట్టించుకోని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు



**శింగనమల జనవరి 13:బహుజన వేదిక న్యూస్** రాచేపల్లి గ్రామంలో గత ఐదు రోజుల నుంచి త్రాగునీరు రావడంలేదని అధికారులు తెలియజేసిన ఏ మాత్రం పట్టించుకోలేదని రాచేపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్రాగునీరు రాకపోవడం వల్ల కేవలం బోరింగ్ నీళ్లు మాత్రమే త్రాగునీటికి ,ఇంటి అవసరాలకు మాత్రమే పరిస్థితి ఉందని పాడి పశువులకు, ఇంటి పనులకు నీళ్ల సదుపాయం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఎన్నిసార్లు విన్నవించిన ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేద వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా త్రాగునీరు సదుపాయం కల్పించే విధంగా అధికారులు స్పందించాలని రాచేపల్లి గ్రామస్తులు కోరుతున్నారు

## అడవులను కాపాడుకోవాలి


-: ఇంఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురము, జనవరి 13 :బహుజన వేదిక న్యూస్**అడవులకు అగ్గి పడకుండా చూసుకునే బాధ్యత అందరి మీద ఉందని, అడవులను కాపాడుకోవాలని ఇంఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం నగరంలోని ఇంఛార్జి జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో అడవికి నిప్పు, మానవాళికి ముప్పు అనే ఫైర్ అవేర్నెస్ పోస్టర్ ను ఇంఛార్జి జిల్లా కలెక్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఇంఛార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అడవికి నిప్పు, మానవాళికి ముప్పు అని, అడవిలో కాలిపోవడం ద్వారా నష్టాలు నష్టాలు ఉన్నాయని, అడవులను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అటవీశాఖ అధికారి టి.చక్రపాణి, అనంతపురం సామాజిక వన విభాగం డిఎఫ్ఓ గురు ప్రభాకర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్, డిప్యూటీ రేంజ్ అధికారి, సెక్షన్ అధికారి, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# అరటి ఎగుమతి పై ప్రత్యేక చర్యలు





జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణన్ శర్మ

**అనంతపురము జనవరి 13:బహుజన వేదిక న్యూస్** జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించే విధంగా మరియు అధికఎగుమతులనుమెరుగుపరచడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణన్ శర్మ తెలిపారు. మంగళవారం సాయంత్రం అమరావతి నుండిప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కృష్ణ బాబు మరియు రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు ఆంధ్రప్రదేశ్ మారి టైం బోర్డ్ అధికారులు తదితరులు జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా నుండి రైలు మార్గం ద్వారా అరటి ఎగుమతుల పై సమీక్షించారు. ఈ సందర్భంగా రవాణా ఖర్చు తగ్గింపులు ఇతర మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలతో పాటు ఉద్యాన పంట రైతులకు ప్రోత్సహిస్తూ వారికి లబ్ధి చేరే విధంగా పలు అంశాలపై చర్చించారు. జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ జూమ్ కాన్ఫరెన్స్లో పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత సీజన్ ప్రారంభమైనప్పటికీ రైలు మార్గం ద్వారా అరటి ఎగుమతులు సకాలంలో రవాణా కావడం లేదని దీనికి సంబంధించి రైల్వే శాఖ అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతపురం జిల్లాలో రైళ్ల ద్వారా అరటి ఎగుమతులు మెరుగు పరచడమే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైళ్లను నిరంతరం నడిపేవిధంగాచర్యలుతీసుకోవాలని కోరారు. ఎగుమతి దారులు కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అలాగే లాజిస్టిక్స్ మద్దతుపై కూడా చర్చించారు. జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే కాంకర్ వారు చార్జీలలో రూ 6000 దాకా సబ్సిడీ తగ్గింపు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం అరటి ఎగుమతులు ప్రధానంగా 3 నెలలు మాత్రమే ఎక్కువగా జరుగుతున్నాయని దీనిని 6 నెలల నుండి 7 నెలల వరకు పొడిగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. లాజిస్టిక్ సమస్యల భాగంగా రవాణా ఖర్చులు ఎక్కువగా ఉండటంవల్ల ఎగుమతి దారులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి ఏవైనా ప్రోత్సాహకాలు అందిస్తే బాగుంటుందని కోరారు. ఖాళీ కంటైనర్లు చెన్నై నుండి వచ్చినట్లయితే ఉంటే రవాణా ఖర్చుతగ్గేఅవకాశంఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. తాడిపత్రితో పాటు జంగాలపల్లి పర్వనాయిపల్లి అవసరమైతే మరిన్ని రైల్వే స్టేషన్లో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎగుమతులకు అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో అరటి ఎగుమతులు ఇతర ఉద్యాన పంటల ఉత్పత్తులపై ప్రభుత్వ ముఖ్యకార్యదర్శికివివరించారు. అనంతరం ప్రభుత్వ కార్యదర్శి మాట్లాడుతూ రైళ్లలో ఎగుమతులు నిరంతర ప్రక్రియగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎగుమతి దారుల సమస్యలను గుర్తించి జిల్లా యంత్రాంగం పరిధిలో వారికి తగిన సహకారాలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, గుంతకల్లు రైల్వే డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పలువురు లాజిస్టిక్ సపోర్టర్లు లైన్స్ సప్లయర్స్ ఎగుమతి దారులు హార్టికల్చర్ అధికారులు మార్కెటింగ్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు

## జాయింట్ కలెక్టర్, ఎస్పీలను కలిసిన పరిటాల శ్రీరామ్

**అనంతపురం జిల్లా జేసీ బదిలీ నేపథ్యంలో శ్రీరామ్ భేటీ**

**శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీతో మర్యాదపూర్వక భేటి**

**పలు అంశాల గురించి చర్చించిన పరిటాల శ్రీరామ్**

**విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ కి ఘనంగా సత్కారం**





**దర్మవరం జనవరి 13:బహుజన వేదిక న్యూస్** అనంతపురము జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ లతో ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. మంగళవారం అనంతపురంలో క్యాంప్ కార్యాలయానికి వచ్చి జేసీని ఆయన ఛాంబర్ లో కలిశారు. తాజాగా ఆయన శ్రీ అన్నమయ్య జిల్లాకు బదిలీ అయిన నేపథ్యంలో శ్రీరామ్ కలిశారు. జిల్లాలో బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల అభివృద్ధికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ను పుట్టపర్తిలోని ఎస్పీలో కార్యాలయంలో కలిశారు. ధర్మవరం నియోజవర్గంలోని పలు అంశాల గురించి చర్చించారు. శాంతి భద్రతల విషయంలో తమ వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని శ్రీరామ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ ను కూడా పరిటాల శ్రీరామ్ కలిశారు. ఆయన సీజీఎంగా పదోన్నతి పొందగా.. పుట్టపర్తి లోని సాయి ఆరామంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో సంపత్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. జిల్లాలో విశేషమైన సేవలందించారని.. ఇందుకు ప్రజల తరుపున శ్రీరామ్ కృతజ్ఞతలు చెప్పారు. జేసీ, ఎస్పీ, ఎస్ఈలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు కూడా తెలిపారు.

## జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపిఎస్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా సురక్ష వాహనం ద్వారా అవగాహన సదస్సులు







### సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం

**అనంతపురము జనవరి 13:బహుజన వేదిక న్యూస్** జిల్లాలోని ప్రజలు సైబర్ నేరాలలో ఇరుక్కుపోకుండా ఉండేందుకు ప్రజలలో అవగాహన తేవడం ముఖ్యమని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపిఎస్ సంకల్పించారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ సైబర్ నేరాల అనర్థాలపై చైతన్యం తీసుకురావడానికి సురక్ష డిజిటల్ డిస్ప్లే వాహనాన్ని రంగంలోకి దింపారు. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా అదానీ గ్రూప్ వారి సహకారంతో 2025 ఏప్రిల్ 17న ప్రారంభించిన డిజిటల్ డిస్ప్లే అవగాహన వాహనం ద్వారా సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, మత్తు పదార్థాల దుర్వినియోగం, మహిళలపై నేరాలు, రోడ్డు భద్రత వంటి కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అధునాతన ఎల్ఈడీ స్క్రీన్లు మరియు ఆడియో–విజువల్ సాంకేతికతతో కూడిన ఈ వాహనం ద్వారా గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రజా ప్రదేశాలు మరియు రద్దీ ప్రాంతాల్లో ప్రభావవంతమైన సందేశాలు ప్రసారం చేస్తున్నారు. ఈ డిజిటల్ డిస్ప్లే అవగాహన వాహనం (సురక్ష వాహనం) క్యాంపెయిన్ ద్వారా ఇప్పటివరకు 38 పోలీస్ స్టేషన్ల పరిధిలోని 760 గ్రామాలు కవర్ చేశారు. సుమారు 7,60,000 మంది ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ...228 పాఠశాలలు మరియు 152 కళాశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల ద్వారా సుమారు 5,00,000 మంది విద్యార్థులను చేరుకున్నారు. అదేవిధంగా 15 పట్టణాలలో ఈ కార్యక్రమం ద్వారా సుమారు 45,000 మంది ప్రజలకు చైతన్యం కల్పించబడింది. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, నకిలీ కాల్స్/సందేశాలు, గుర్తింపు దొంగతనం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ, వ్యక్తిగత సమాచార భద్రత, సురక్షిత డిజిటల్ చెల్లింపులు, సైబర్ నేరాలపై 1930 హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాల్సిన విధానాన్ని వివరించారు. మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహనలో మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాలను వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించాల్సిన ప్రారంభ లక్షణాలు, యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచే చర్యలు, కౌన్సెలింగ్ మరియు పునరావాసంపై దృష్టి సారించారు. మహిళలపై నేరాల నియంత్రణపై మహిళల చట్టపరమైన హక్కులు, సహాయ వ్యవస్థలపై అవగాహన కల్పిస్తూ, వేధింపులు, గృహ హింస, వెంటాడటం వంటి ఘటనలను వెంటనే పోలీసులకు లేదా హెల్ప్‌లైన్లకు తెలియజేయాలని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహనలో హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, అతివేగం మరియు మద్యం సేవించి వాహనం నడపరాదని, పాదచారుల భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటన ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ప్రజలకు వివరించారు.

### ఆస్ట్రేలియాకు బిగ్ షాక్.. హఠాత్తుగా వీడ్కోలు పలికిన కెప్టెన్..!

ఆస్ట్రేలియా మహిళా జట్టు కెప్టెన్ అలీసా హీలీ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. పదహారేళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్టు ఆసీస్ సారథి ప్రకటించింది. స్వదేశంలో త్వరలో భారత జట్టులో సిరీస్ తర్వాత అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతానని మంగళవారం అలీసా వెల్లడించింది. పొట్టి ప్రపంచకప్ కోసం ఆస్ట్రేలియా సన్నద్ధమవుతున్నందున తాను టీమిండియాతో జరుగబోయే టీ20 సిరీస్‌లో మాత్రం ఆడబోనని ఆమె స్పష్టం చేసింది. ఆసీస్ దిగ్గజ వికెట్ కీపర్ ఇయాన్ హీలీ మేనకోడలైన అలీసా హీలీ 19 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. 2010లో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో తను తొలి మ్యాచ్ ఆడింది. వికెట్ కీపర్‌గా, విధ్వంసక ఓపెనర్‌గా జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకున్న హీలీ మూడేళ్ల క్రితం కెప్టెన్సీ చేపట్టింది.

### దళితుల భూములకు రక్షణ కల్పించండి సాకే హరి




**కణేకల్ జనవరి13:బహుజన వేదిక న్యూస్** దళితుల భూములను ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. మంగళవారం కనేకల్ మండల తహసిల్దార్ సాకే బ్రహ్మయ్యకు దళితుల భూములను కబ్జా,దౌర్జన్యాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భూ బాధితులతో కలిసి సాకే హరి వినతి పత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో దళితులకు చెందిన ఇల్లు స్థలాలు వ్యవసాయ భూములు చివరికి స్మశానవాటికల సైతం అక్రమణాలకు గురవుతున్న పట్టించుకునే వారే కరవయ్యారన్నారు. బెనేకల్,మాల్యం గ్రామాల్లో దళితులకు చెందిన భూములు ఇల్లు స్థలాలు ఇప్పటికే కబ్జాదారులు ఆక్రమించుకొని దళితులనే బెదిరించడం అన్యాయమన్నారు. అలాగే నేటికీ కుల వివక్షతకు గురి చేస్తున్నారని ఆటో వంటి గ్రామాలను గుర్తించి కుల వివక్షతను పాటిస్తే కఠిన శిక్షలు తప్పవని సామాజిక సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి వసంత కుమార్. జేఏసీ నాయకులు బెనేకల్ గోవిందు. అనిల్,రాజు, దయానంద్, పకీరప్ప రామన్న,రామకృష్ణ,నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాల పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

సబ్ యూనిట్ అధికారి

ఇండ్ల సుబ్బరాయుడు



**బద్వేలు జనవరి 13 : బహుజన వేదిక న్యూస్** ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని పరిశుభ్రత పాటిస్తే ఏ వ్యాధులు రావని సబ్ యూనిట్ అధికారి పేర్కొన్నారు మంగళవారం ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని మంటపంపల్లి సచివాలయం లో గల మల్లంపేట హరిజనవాడ, లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ భావన రెడ్డి ఆధ్వర్యంలో సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు స్కబ్ టైఫస్ వ్యాధి గురించి అవగాహన కల్పించడం జరిగింది. డాక్టర్ భావన మాట్లాడుతూ స్కబ్ టైఫస్ వ్యాధి చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. పిహెచ్ఎన్ వెంకట సుబ్బమ్మ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. సూపర్ వైజర్ భాస్కర్ రెడ్డి దోమల ద్వారా వ్యాపించు వ్యాధుల గురించి తెలియ జేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఏఎన్ఎం సరోజ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

### మహిళా సాధికారితకు ప్రోత్సాహం ఆకుల వెంకటేశ్



**తాండూర్, జనవరి 13 :** మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేశ్, ఏపీఎం శ్యామల అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధి రేపల్లెవాడ గ్రామంలో అభినయ గ్రామ సంఘం వారికి పెరటి కోళ్ల పెంపకం పథకం ద్వారా మంజూరైన 26 యూనిట్స్ కోళ్లను గ్రూప్ సభ్యులకు అందజేయడం జరిగింది. ఒక కోడికి రూ.130 చొప్పున సబ్సిడీ ద్వారా అందించినట్లు వారు తెలిపారు. అవి పెరిగి పెద్దగా అయిన తర్వాత వాటి అమ్మకం ద్వారా వచ్చిన లాభాలను సభ్యులందరూ పొందిన తర్వాత సబ్సిడీ కింద ఇచ్చిన కోళ్లకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలానికి మొత్తం 250 యూనిట్స్ రావడం జరిగిందని ఏపీఎం తెలిపారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పై వచ్చే పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా మరింత ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొల్లూరి సంగీత, సీసీ రాజేశ్వరి, వీవీఏ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న సాగు భళా.. మద్దతు ధర దక్కదేమోనని రైతు ఆందోళన..!

**కుభీర్ :** అన్నం పెట్టే రైతన్నకు సున్నం పెట్టినట్లుగా ఉంది రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం. ఆరుగాలం రెక్కలను ముక్కలు చేసుకుని కష్టించి పండించిన పంటకు మద్దతు ధర లభించక, పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్ట పోతున్న రైతన్నలకు భరోసా లేకుండా పోయింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి కారణంగా ప్రధాన పంటలైన సోయా, పత్తి దెబ్బతిని సగానికి సగం దిగుబడులు తగ్గిపోయాయి. వచ్చిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొర్రీలు పెట్టి 25% సోయాబీన్ కూడా కొనుగోలు చేయలేదు. దాంతో రైతులు దళారులకు, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు పంటను అమ్ముకున్నారు. పీకల్లోతూ కష్టాల్లో మునిగిపోయారు. ఫలితంగా యాసంగిలోనైనా పత్తి, సోయాకు బదులుగా మొక్కజొన్న సాగుచేసి కొంతలో కొంతైనా నష్టాన్ని పూడ్చుకొందామని మండలంలోని రైతులు భావించారు. అనుకున్నట్లుగానే గత ఏడాది యాసంగి కంటే ఈ ఏడు యాసంగిలో మొక్కజొన్నను దాదాపు రెట్టింపు సాగుచేశారు. నిరుడు 9 వేల పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్న సాగవగా.. ఈ ఏడు 13 వేల ఎకరాల్లో సాగు జరిగింది. జనవరి చివరి వారం నుండి మొక్క జొన్న కోతకు రానుంది. ఈ తరుణంలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మొక్కజొన్నకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో గిట్టుబాటు అవుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం పంటలు సాగుచేసిన రైతాంగాన్ని ఆగం పట్టిస్తోంది. సోయా పంటను కొంటామని చెప్పి రంగు మారిందని, తేమ ఉందని, జల్లెడ పేరిట సవాలక్ష ఆంక్షలు విధించి కేవలం 40, 50 శాతం మాత్రమే కొనుగోలు చేసి రైతులను నష్టాల్లోకి నెట్టారు. మొక్కకొన్న చేతికొచ్చిన తర్వాత అదే పరిస్థితి పునరావృతం అవుతుందేమోనన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవు తున్నాయి.

# మేడారం జాతర ఫుల్ షెడ్యూల్



**వరంగల్ :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు రంగం సిద్ధమైంది. జనవరి 29న సమ్మక్క దేవత గద్దెపై ప్రతిష్ఠించబడటంతో పాటు, భక్తుల మొక్కుల సమర్పణ, దేవతల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది. తెలంగాణ ప్రభుత్వం రూ. 100 కోట్లకు పైగా నిధులతో విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు సమయం దగ్గర పడుతోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామం వనదేవతల రాక కోసం ముస్తాబవుతోంది. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క-సారలమ్మల మహా జాతర గడియలు సమీపిస్తుండటంతో అటవీ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నాలుగు రోజుల పాటు అశేష జనవాహిని మధ్య జరిగే ఈ మహా ఉత్సవానికి ఇప్పటికే పూజారులు ముహూర్తాలు ఖరారు చేశారు.

**జాతర కీలక ఘట్టాలు.. పూర్తి షెడ్యూల్ ఇదే..**

మహా జాతరకు రెండు వారాల ముందు నుంచే మేడారంలో ఆచార వ్యవహారాలు మొదలవుతాయి.

జనవరి 14 గుడిమెలిగే పండగ: దేవతలకు ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

జనవరి 21న మండమెలిగే పండగ: జాతర విజయవంతం కావాలని కోరుతూ పూజారులు దేవతలను ప్రార్థిస్తారు. ఈ రెండు పండుగలు ముగియడంతోనే మేడారంలో జాతర వాతావరణం పీక్ స్టేజ్‌కు చేరుకుంటుంది.

వనదేవతలు గద్దెలకు చేరుకునే క్రమం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య సాగుతుంది.

జనవరి 27: మహబూబాబాద్ జిల్లా నుంచి పగిడిద్దరాజు, కన్నెపల్లి నుంచి జంపన్న మేడారానికి పయనమవుతారు.

జనవరి 28: కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు గద్దెలపై కొలువుదీరుతారు.

**జనవరి 29 (కీలక ఘట్టం)**

చిలుకలగుట్ట నుంచి కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్క దేవతను పూజారులు తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. ఈ సమయంలో భక్తుల పూనకాలు, శివసత్తుల విన్యాసాలతో అడవి దద్దరిల్లుతుంది.

జనవరి 30: భక్తులు సమర్పించే నిలువెత్తు బంగారం (బెల్లం) మొక్కులతో గద్దెలు నిండిపోతాయి.

జనవరి 31: దేవతల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది.

ఫిబ్రవరి 4న నిర్వహించే తిరుగువారం పండుగతో ఉత్సవాలు అధికారికంగా సమాప్తమవుతాయి.

**ప్రభుత్వ ఏర్పాట్లు - అభివృద్ధి పనులు**

ఈసారి రికార్డు స్థాయిలో భక్తులు వస్తారనే అంచనాతో తెలంగాణ ప్రభుత్వం రూ. 100 కోట్లకు పైగా నిధులతో ఏర్పాట్లు చేస్తోంది. గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీని తట్టుకునేలా క్యూలైన్లను వెడల్పు చేశారు. జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను ఆధునీకరించారు. ఆర్టీసీ వేల సంఖ్యలో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అడవిలో తాత్కాలిక వైద్య శిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక గ్రిడ్లను ఏర్పాటు చేశారు. లక్షలాది మంది భక్తులు వచ్చినా ఇబ్బంది కలగకుండా వేల మంది సిబ్బందితో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు.

## తాండూర్‌లో 'అరైవ్ అలైవ్' ప్రోగ్రామ్..

# రోడ్డు భద్రతపై అవగాహన




**తాండూరు :** తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య, ఎస్ఐ సౌజన్య, తాండూర్ పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వారసంతలో కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్ అధ్యక్షతన మంగళవారం 'అరైవ్ అలైవ్' రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, ఆటో డ్రైవర్లు, యజమానులు, వివిధ సంస్థల ప్రతినిధులు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు దెబ్బతింటున్నాయని, ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాలు, ఎండలు, విపత్తులు.. ఏ పరిస్థితుల్లోనైనా పోలీసులు ప్రజల కోసం అంకిత భావంతో పనిచేస్తున్నారని గుర్తుచేశారు. పడినచోట ప్రమాదాన్ని చూసిన వెంటనే సహాయం చేసే వారికి పోలీసులు గౌరవం అందిస్తున్నారని, ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని తెలిపారు. 'అర్రివ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాదరహిత జిల్లాగా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో, యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే కాకుండా, ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరాన్ని కూడా స్పష్టంగా తెలియజేశారు.

**కన్నీరు మున్నీరైన బాధితులు..**

ఈ సదస్సులో గతంలో రోడ్డు ప్రమాదాల్లో తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధితులు పాల్గొని తమ ఆవేదనను పంచుకున్నారు. తల్లీ, తండ్రి, ఎదిగివచ్చిన కుమారులు, కూతుర్లు, సంపాదించే వ్యక్తిని యాక్సిడెంట్‌లో కోల్పోయి వారు అనుభవిస్తున్న బాధలు వెల్లడించారు. తమకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదని, రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని వారు కన్నీటి పర్యంతమయ్యారు. వారి మాటలు సదస్సులో అందరిని ఆలోచింపజేశాయి. ఆ తర్వాత అందరితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఎమ్మెల్యేతోపాటు నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఆర్థిక సాయంగా నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, ఇంచార్జ్ ఎంపిడివో వేణుగోపాల్ రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆటో డ్రైవర్లు, యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

### ఇల్లెందు మండలంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్



**ఇల్లెందు :** ఇల్లెందు మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్‌కు చెందిన 150 కుటుంబాలు, ఐదుగురు వార్డు సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి హరిప్రియ నాయక్ సమక్షంలో మంగళారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇల్లెందు మండలం మర్రిగూడెం పంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ మర్రిగూడెం నాయకురాలు యదలపల్లి రేణుక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మర్రిగూడెం, కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలకు చెందిన ఇండిపెండెంట్, ఎన్డీ పార్టీలో గెలిచిన ఐదుగురు వార్డు మెంబర్లు, అధికార కాంగ్రెస్ పార్టీ నుండి 100 కుటుంబాలు, అలాగే ఎన్డీ, ఇతర పార్టీల నుండి 50 కుటుంబాలు మొత్తం 150 కుటుంబాలు మండల అధ్యక్షుడు శీలం రమేశ్ అధ్యక్షతన బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న మున్సిపాలిటీ, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందనడానికి చేరికలను చూస్తే అర్థమవుతుందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన యువకులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఖమ్మం పాటి రేణుక, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ జబ్బార్, బీఆర్ఎస్ నాయకులు ఎస్.రంగనాథ్, సిలివేరి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మౌనిక, స్థానిక నాయకులు సారయ్య, కోటి, సువర్ణపాక సత్యనారాయణ పాల్గొన్నారు.

### కాంపెల్లి సోలార్ ఎనర్జీ న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ




**రామవరం, జనవరి 13 :** బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు, మాజీ కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు, పాల్వంచకు చెందిన కాంపెల్లి కనకేష్ పటేల్‌కు చెందిన కాంపెల్లి సోలార్ ఎనర్జీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను పార్టీ జిల్లా కార్యాలయంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా వెంకటేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. థర్మల్ విద్యుత్ వల్ల కాలుష్యం పెరుగుతుందని, విద్యుత్ తయారీకి ప్రభుత్వంపై భారం పడుతుందన్నారు. కావునా ప్రతి ఒక్కరు తమ ఇంటిపై సోలార్ అమర్చుకుంటే ఎవరింటికి సరిపడా వారు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడమే కాకుండా కాలుష్యం తగ్గుతుందన్నారు. గృహ అవసరాలకు సోలార్ ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం రూ.78 వేల వరకు సబ్సిడీ ఇస్తుందన్నారు. అంతేకాకుండా బ్యాంక్ రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో దిండిగల రాజేందర్, కాపు సీతాలక్ష్మి, మల్లెల రవిచంద్ర, కొట్టి వెంకటేశ్వర్లు, వేల్పుల దామోదర్, లకావత్ గిరిబాబు, మంతపురి రాజు గౌడ్, కోడి అమరేందర్, గోపిరెడ్డి, కాపు కృష్ణ, కాలేరు సింధు తపస్వి, బాదావత్ శాంతి, లావుడ్య సత్యనారాయణ, గోవాడ గుణ చరిత్, తోటలోహిత్ సాయి, నవతన్, బట్టు జవహర్, ఇర్ఫాన్, కాలేరు అఖిల్, మహర్షి పాల్గొన్నారు.

### మహిళా సాధికారితకు ప్రోత్సాహం : ఆకుల వెంకటేశ్



**తాండూర్, జనవరి 13 :** మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేశ్, ఏపీఎం శ్యామల అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధి రేపల్లెవాడ గ్రామంలో అభినయ గ్రామ సంఘం వారికి పెరటి కోళ్ల పెంపకం పథకం ద్వారా మంజూరైన 26 యూనిట్స్ కోళ్లను గ్రూప్ సభ్యులకు అందజేయడం జరిగింది. ఒక కోడికి రూ.130 చొప్పున సబ్సిడీ ద్వారా అందించినట్లు వారు తెలిపారు. అవి పెరిగి పెద్దగా అయిన తర్వాత వాటి అమ్మకం ద్వారా వచ్చిన లాభాలను సభ్యులందరూ పొందిన తర్వాత సబ్సిడీ కింద ఇచ్చిన కోళ్లకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలానికి మొత్తం 250 యూనిట్స్ రావడం జరిగిందని ఏపీఎం తెలిపారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పై వచ్చే పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా మరింత ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొల్లూరి సంగీత, సీసీ రాజేశ్వరి, వీవీఏ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న సాగు భళా.. మద్దతు ధర దక్కదేమోనని రైతు ఆందోళన..!



**కుభీర్ :** అన్నం పెట్టే రైతన్నకు సున్నం పెట్టినట్లుగా ఉంది రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం. ఆరుగాలం రెక్కలను ముక్కలు చేసుకుని కష్టించి పండించిన పంటకు మద్దతు ధర లభించక, పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్ట పోతున్న రైతన్నలకు భరోసా లేకుండా పోయింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి కారణంగా ప్రధాన పంటలైన సోయా, పత్తి దెబ్బతిని సగానికి సగం దిగుబడులు తగ్గిపోయాయి. వచ్చిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం కోర్రీలు పెట్టి 25% సోయాబీన్ కూడా కొనుగోలు చేయలేదు. దాంతో రైతులు దళారులకు, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు పంటను అమ్ముకున్నారు. పీకల్లోతూ కష్టాల్లో మునిగిపోయారు. ఫలితంగా యాసంగిలోనైనా పత్తి, సోయాకు బదులుగా మొక్కజొన్న సాగుచేసి కొంతలో కొంతైనా నష్టాన్ని పూడ్చుకొందామని మండలంలోని రైతులు భావించారు. అనుకున్నట్లుగానే గత ఏడాది యాసంగి కంటే ఈ ఏడు యాసంగిలో మొక్కజొన్నను దాదాపు రెట్టింపు సాగుచేశారు. నిరుడు 9 వేల పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్న సాగవగా.. ఈ ఏడు 13 వేల ఎకరాల్లో సాగు జరిగింది. జనవరి చివరి వారం నుండి మొక్క జొన్న కోతకు రానుంది. ఈ తరుణంలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మొక్కజొన్నకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో గిట్టుబాటు అవుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం పంటలు సాగుచేసిన రైతాంగాన్ని ఆగం పట్టిస్తోంది. సోయా పంటను కొంటామని చెప్పి రంగు మారిందని, తేమ ఉందని, జల్లెడ పేరిట సవాలక్ష ఆంక్షలు విధించి కేవలం 40, 50 శాతం మాత్రమే కొనుగోలు చేసి రైతులను నష్టాల్లోకి నెట్టారు. మొక్కకొన్న చేతికొచ్చిన తర్వాత అదే పరిస్థితి పునరావృతం అవుతుందేమోనన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. మొక్కజొన్నకు కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ రూ. 2400 ప్రకటించినప్పటికీ.. పంట చేతికొచ్చేలోపు కొనుగోలు కేంద్రాలను తెరిచి సకాలంలో కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది మార్చిలో ప్రైవేటులో క్వింటా మక్కలకు రూ.18,00 నుంచి 2,100 చెల్లించారు. ఈ సారి మద్దతు ధర కంటే ఎక్కువగా క్వింటా మక్కలకు కనీసం రూ.2600 లభిస్తే కొంతలో కొంతైనా నష్టాలను పూడ్చుకోవచ్చంటున్నారు రైతులు. ప్రభుత్వం నెలరోజుల ముందే మండలంలో కనీసం 4 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేయాలని మండల రైతాంగం కోరుకుంటోంది.

### ఏవైనా ఉంటే గవర్నమెంట్‌ను అడుక్కోండి.. నిలదీసిన ప్రజలతో మంత్రి వివేక్ దురుసు ప్రవర్తన



మంచిర్యాల జిల్లాలో మంత్రి వివేక్ వెంకటస్వామికి నిరసన సెగ తగిలింది. తమ ప్రాంత సమస్యలపై క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు మంత్రిని నిలదీశారు. ముఖ్యంగా రహదారి పనులు కూడా చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా ఒక్క అభివృద్ధి పని కూడా కనిపించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. స్థానికుల ప్రశ్నలతో మంత్రి వివేక్ వెంకటస్వామి తీవ్ర అసహనానికి గురయ్యారు. సమస్యలపై నిలదీసిన ప్రజలతోనే మంత్రి వివేక్‌తో పాటు డీసీసీ అధ్యక్షుడు రఘునాథ రెడ్డి దురుసుగా ప్రవర్తించారు. రహదారి అవసరమైతే ప్రభుత్వాన్ని అడుక్కోండంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. తమ సమస్యల గురించి వినకుండా, దురుసుగా వ్యవహరించారంటూ మంత్రి వివేక్ తీరుపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.




# 'మన శంకరవరప్రసాద్ గారు' ఫస్ట్ డే కలెక్షన్స్ ప్రకటన

చిరంజీవి– అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా ఫస్ట్ డే కలెక్షన్స్ ప్రకటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైన ఈ మూవీ పాజిటీవ్ టాక్ తెచ్చుకుంది. ఇందులో చిరంజీవితో పాటు వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా, సచిన్ ఖేడ్కేర్ తదితరులు నటించారు. ఈ మూవీని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. భోళా శంకర్ వంటి డిజాస్టర్ తర్వాత చిరుకు భారీ హిట్ పడిందని ఫ్యాన్స్ ఫుల్ జోష్‌లో ఉన్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' ప్రీమియర్స్‌తో కలిపి ఫస్ట్ డే భారీ కలెక్షన్స్ రాబట్టింది. ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ. 84కోట్లు రాబట్టినట్లు చిత్ర నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ ప్రకటించింది. మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లోనే రెండో అతిపెద్ద ఓపెనింగ్ చిత్రంగా 'మన శంకరవరప్రసాద్ గారు' నిలబడింది. 'సైరా నరసింహా రెడ్డి' చిత్రానికి మొదటిరోజు రూ. 85 కోట్లు వచ్చిన విషయం తెలిసిందే. ఖైదీ నంబర్ 150'కి (రూ. 51 కోట్లు), వాల్తేరు వీరయ్య (రూ. 49.10 కోట్లు), గాడ్ ఫాదర్ (రూ. 32.70 కోట్లు), ఆచార్య ( రూ. 52 కోట్లు), భోళా శంకర్ (రూ. 28 కోట్లు) వచ్చాయి.




# 100 ఎకరాల పొలం కావాలి.. నటులు మాత్రం వద్దు

## మీనాక్షి చౌదరి కండీషన్స్ వైరల్

టాలీవుడ్‌లో "లక్కీ హీరోయిన్"గా పేరు తెచ్చుకున్న అందాల భామ మీనాక్షి చౌదరి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో కొనసాగుతోంది. గత ఏడాది సంక్రాంతికి విడుదలైన 'వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, ఇప్పుడు మరోసారి పండగ సీజన్‌ను టార్గెట్ చేస్తోంది. యంగ్ హీరో నవీన్ పోలిశెట్టితో కలిసి నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు' తో ఈసారి కూడా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు మంచి స్పందన తెచ్చుకోగా, ప్రమోషన్స్‌లో మీనాక్షి చౌదరి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ముఖ్యంగా ప్రీ రిలీజ్ ఈవెంట్స్, ఇంటర్వ్యూల్లో ఆమె మాట్లాడిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో తనకు కాబోయే భర్త గురించి మాట్లాడిన మీనాక్షి చౌదరి, కొన్ని ఆసక్తికరమైన 'కండిషన్స్' పెట్టి అందరినీ నవ్వులు పూయించింది. తన భర్త డాక్టర్, నటుడు లేదా మిస్టర్ ఇండియా మాత్రం అసలు కాకూడదని స్పష్టం చేసింది. తాను ఇప్పటికే సినిమా రంగంలో ఉన్నానని, ఇంట్లో మరోసారి అదే ప్రొఫెషన్ అవసరం లేదని చమత్కారంగా వ్యాఖ్యానించింది. అంతేకాదు, తన జీవిత భాగస్వామికి 100 ఎకరాల పొలం ఉండాలి అంటూ చెప్పిన మాటలు ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయం, పల్లెటూరి వాతావరణం అంటే తనకు చాలా ఇష్టమని తెలిపింది. ఇక ఇంటి పనుల విషయంలో కూడా మీనాక్షి తన స్టైల్‌లో కండిషన్స్ పెట్టింది. వంట చేయడం, బట్టలు ఉతకడం, ఐరన్ చేయడం వంటి పనులు రావాలని చెప్పి నవ్వులు పూయించింది. అబ్బాయికి గతంలో బ్రేకప్స్ ఉన్నా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే పొడవుగా ఉండాలని మాత్రం కచ్చితంగా చెప్పింది. రోజుకు రెండు మూడు సార్లు లవ్ ప్రపోజ్ చేస్తూ, గిఫ్ట్స్ ఇచ్చే వ్యక్తే తన "రాజు" అంటూ సరదాగా పేర్కొంది. ఇటీవల కొంతకాలంగా మీనాక్షి చౌదరికి టాలీవుడ్ హీరోలతో ప్రేమాయణం ఉందంటూ పలు రూమర్స్ వినిపించాయి. అయితే వాటన్నింటినీ ఆమె ఖండిస్తూ, పూర్తిగా అబద్ధమని కొట్టి పారేసింది. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది. 'అనగనగా ఒక రాజు' సినిమాతో పాటు మీనాక్షి చౌదరి ఇతర భాషల్లోనూ బిజీగా ఉంది. కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ నటిస్తున్న 63వ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే తమిళంలో 'వృషకర్మ' అనే చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది.

# నాలుగు రోజుల్లో రూ.200 కోట్లు.. 'ది రాజాసాబ్' రికార్డు కలెక్షన్స్!

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'ది రాజాసాబ్'మూవీకి మిక్స్‌డ్ టాక్ వచ్చినా.. బాక్సాఫీస్ వద్ద మాత్ర భారీ కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది. తొలి రోజే రూ. 112 కోట్లు వసూలు చేసిన 'రాజాసాబ్'... నాలుగు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా 201 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను సాధించింది. ఈ మేరకు మేకర్స్ అధికారికంగా ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ ఈ రేంజ్‌లో కలెక్షన్స్ రాబట్టడం చూసి ట్రేడ్ వర్గాలు షాకవుతున్నాయి. అయితే ప్రభాస్ స్థాయికి ఈ కలెక్షన్స్ తక్కువే కానీ.. పోటీలో చిరంజీవి లాంటి సినిమాలు ఉన్నప్పటికీ ఈ స్థాయిలో రావట్టడం గొప్ప విషయం. మారుతి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పిపుల్ మీడియా ఫ్యాక్టర్ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటించారు. సంక్రాంతి కానుకగా ఈ నెల 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హాలీడేస్ సీజన్ లో ఫస్ట్ వీక్ "రాజా సాబ్" హ్యూజ్ నెంబర్స్ క్రియేట్ చేస్తుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి.




# భాషతో సంబంధం లేదు.. నచ్చితే ఓకే చెప్తా కల్యాణి ప్రియదర్శన్

ఇటీవల 'లోకా: ఛాప్టర్ 1 – చంద్ర' చిత్రంతో అదిరిపోయే విజయాన్ని అందుకున్న నటి 'కల్యాణి ప్రియదర్శన్'. అందులో సూపర్ హీరో పాత్రలో నటించి మలయాళంతో పాటు, తమిళం తెలుగు, ప్రేక్షకులను అలరించారు. అంతేకాకుండా మాతృభాషతో పాటూ తెలుగు, తమిళం భాషల్లో కథానాయికగా నటిస్తూ బిజీగా ఉన్న ఈ బ్యూటీ తాజాగా బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా ఇటీవల ఈ అమ్మడు ఒక భేటీలో పేర్కొంటూ లోకా చిత్రం తరువాత తనకు పలు భాషల్లో పలు అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. అయితే మంచి పాత్ర అని అనిపిస్తే నటించడానికి సిద్ధమని పేర్కొన్నారు. మరాఠీ, హిందీ, తెలుగు, తమిళం, మలయాళ భాషలను తాను ఎప్పుడు వేర్వేరుగా చూడనన్నారు. కథ చెప్పడం అన్నది ప్రపంచ భావోద్వేగం అన్నారు. ఒక మంచి కథలో నటించే అవకాశం వస్తే పూర్తి సమయాన్ని కేటాయించి, మనసుపెట్టి నటించడానికి తాను ఎప్పుడు సిద్ధమే అన్నారు. కాగా ఈమె రవి మోహన్ సరసన నటించిన జీనీ చిత్రం నిర్మాణ కార్యక్రమం పూర్తిచేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. కాగా ప్రస్తుతం కార్తీ కి జంటగా మార్షల్ చిత్రంలో నటిస్తున్నారు. మరిన్ని చిత్రాలు తన కోసం ఎదురుచూస్తున్నట్లు తనుస్వయంగా చెప్పారు. అదేవిధంగా తనకు సూపర్ హీరో ఇమేజ్ తెచ్చిపెట్టిన లోకా చిత్రానికి పార్ట్ 2 కూడా ఉంది. ఇందులో కూడా ఆమె నాయకగా నటించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.



# బాలీవుడ్‌లో హద్దులు దాటుతున్న పీఆర్ వ్యూహాలు

బాలీవుడ్ నటి తాప్సీ పన్ను ఇటీవల హిందీ చిత్ర పరిశ్రమలో పెరుగుతున్న పబ్లిసిటీ సంస్కృతిపై తన అభిప్రాయాన్ని బహిరంగంగా వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో బాలీవుడ్‌లో పీఆర్ వ్యూహాలు పూర్తిగా మారిపోయాయని, ఇప్పుడు ప్రమోషన్ అనేది కేవలం తమ సినిమా గురించి మాట్లాడటానికే పరిమితం కాకుండా, ఇతరులను తక్కువగా చూపించే స్థాయికి వెళ్లిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొన్ని పీఆర్ టీమ్స్ తమ సినిమాలకు హైప్ క్రియేట్ చేయడానికి ఇతర నటులు, సినిమాలపై నెగటివ్ కథనాలు ప్లాంట్ చేస్తున్నాయి. ఇది ఒక రకమైన పోటీ కాదు, పూర్తిగా తప్పుదారి పట్టిన విధానం" అని వ్యాఖ్యానించారు. సినిమా కంటెంట్, నటన, కథ బలం గురించి మాట్లాడాల్సిన చోట, వ్యక్తిగత విమర్శలు లేదా ఇతరులపై నిందలు వేయడం ట్రెండ్‌గా మారిందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇలాంటి పీఆర్ గేమ్స్‌లో తాను ఎప్పుడూ భాగం కాలేదని తాప్సీ స్పష్టం చేశారు. నేను అలాంటి వ్యూహాలకు దూరంగా ఉండటం పట్ల చాలా రిలీఫ్‌గా ఫీలవుతున్నాను. నా పని నా సినిమాల ద్వారా మాట్లాడాలని నమ్ముతాను. ఇతరులను కిందకు లాగి పైకి రావడం నాకు ఇష్టం లేదు అని ఆమె తెలిపారు. ఈ మాటలు ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన పోటీ అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని సినీ విశ్లేషకులు అంటున్నారు. తాప్సీ వ్యాఖ్యలు బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం స్టార్ ఇమేజ్, సోషల్ మీడియా ట్రెండ్స్, వైరల్ కథనాలే సినిమాల భవితవ్యాన్ని నిర్ణయిస్తున్న సమయంలో, ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు పీఆర్ వ్యవస్థపై పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి.



Publisher, printer and Owner P. Ramanjaneya Prasad, Government Hospital back SIDE Singanamala (Mandal) Ananthapuram (District)- AP, Printing at LAKSHMI OFFSET Printers, D.NO: 12-3-195, 5th cross SAINAGAR Beside Veterinary Hospital Ananthapuram,
Published at P. Ramanjaneya Prasad Government Hospital Back Side Singanamala (Mandal) Ananthapuram (District)- RNI Reg NO: APTEL/2024/86898 ,AP, Editor P.Ramanjaneya Prasad ph:9494900294